# ఎపి హజ్ బులెటిన్

తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురితం

సంపుటి 2 సంచిక 2
ఫిబ్రవరి - 2018
జమాదియుల్ ఆఖర్, హిజ్రీ 1439

**చీఫ్ ఎడిటర్**
**మహమ్మద్ లియాఖత్ అలీ**

**ఎడిటర్**
**డా.ఫజులుల్లా ఖాన్**

**ఎడిటోరియల్ బోర్డు**
ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ
మౌలానా ముహమ్మద్ ఇల్యాస్
ముఫ్తి కె.ముహమ్మద్ రఫీ

**హజ్ కమిటీ సభ్యులు**
మోమిన్ అహ్మద్ హుస్సేన్ ఛైర్మన్
ముహమ్మద్ అహ్మద్ షరీఫ్ ప్రభుత్వ విప్
షేక్ మస్తాన్ షరీఫ్ జడ్పీటీసీ
టి.మహబూబ్‌సాబ్ ఎంపీపీ
షేక్ అక్బర్ సాహెబ్, వైఎస్.ఎంపిపీ
అబ్దుల్ చినరెహ్మాన్
హాజీ షేక్ హసన్ బాషా
సయ్యద్ షా మఖ్దూమ్ బుఖారి

సంవత్సర చందా 85/-
విడిప్రతి వెల: **15/-**

ప్రచురణ
**ఎపి స్టేట్ హజ్ కమిటీ**
మసీదు వీధి, లబ్బీపేట్, విజయవాడ
**టోల్‌ఫ్రీ నెం: 18004257873**

**అమిత దయాళువు, అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో...**

## ఈ సంచికలో....

| | |
|---|---|
| సంపాదకీయం | 02 |
| పవిత్ర ఖుర్ఆన్ ఉపదేశం | 03 |
| హజ్ ప్రయాణం ఇలా సాగుతుంది... | 05 |
| తెలుసుకోవాల్సిన అరబీ పదాలు | 11 |
| హజ్ విధి - నిబంధనలు | 12 |
| హజ్ 2వ రోజు | 15 |
| ఉమ్రహ్ ఎలా చేయాలి? | 20 |
| అల్లాహ్ ప్రేమించే ఏడు గుణాలు | 26 |
| హజ్‌లో చేయకూడని పనులు | 27 |
| హజ్‌యాత్ర-సందేహాలు-సమాధానాలు | 32 |
| విదేశీ విద్యా పథకం | 33 |

### ఎ.పి.హజ్‌బులెటిన్ చదవాలనుకుంటున్నారా?

వెంటనే చందాదారులుగా చేరండి. హజ్-ఉమ్రా విధివిధానాలను ఖురాన్ హదీస్‌ల ఆధారంగా ఇస్లామిక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో "ఎ.పి.హజ్‌బులెటిన్"ను ఎపి హజ్ కమిటీ ప్రచురిస్తోంది. చందా వివరాలు విడి పత్రి రూ.15/- సంవత్సర చందా రూ.85/- **(డ్రా తేదీ నుంచి హాజ్‌యాత్రకు వెళ్ళే వరకు)**

చందా మొత్తాన్ని ఎపి స్టేట్ హజ్ కమిటీ, **అకౌంట్ నెంబర్: 034310100141377 ఐఎఫ్ఎస్‌సి కోడ్: ఎఎన్‌డిబి0000343 ఆంధ్రబ్యాంక్ లబ్బీపేట్ బ్రాంచ్, విజయవాడలో** జమాచేయాలి.

### ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాం

ప్రతి నెల విడుదలౌతున్న హజ్‌బులెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి హజ్, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన ఆర్టికల్స్ (తెలుగు-ఉర్దూ భాషలో డిటిపి చేయించి ఓపెన్ ఫైల్ aphajjpro@gmail.comకు మెయిల్ చేయాలి). ప్రింట్ అవుట్ కానీ, రాత ప్రతిని కాని పంపరాదు.

**RNI No: TELBIL/2017/73690**
Edited, Printed & Published by **MD Liyakat Ali**, E.O. AP Haj Committee, 3rdFloor, # 39-3-2, Mosque Street, Labbipet, ViJayawada, AP. Printed at AP Haj Committee Vijayawada. Editor: Dr.Fazalullah Khan
**EMail:aphajcommittee@gmail.com,Website:apstatehajcommittee.com**

# సంపాదకీయం

**మసలుల్ లజీనత్ తఖజూ మిన్ దూ నిల్లాహి ఔలియాఅ కమసలిల్ అన్‌కబూత్. ఇత్తఖజత్ బైతా. వ ఇన్న ఔ హనల్ బుయూతి లబైతుల్ అన్‌కబూత్ లౌ కానూ యఅలమూన్.**

**ఇన్నల్లాహ యఅలము మా యద్ఊన మిన్ దూనిహీ మిన్ షైఇ. వ హువల్ అజీజుల్ హకీమ్.**

**(29వ సూర అన్‌కబూత్, ఆయత్ నంబర్ 41, 42, పార నంబర్ 20)**

అల్లాహ్‌ను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారి ఉపమానాన్ని సాలెపురుగు నిర్మించే ఇంటితో ఖురాన్ ఈ ఆయత్‌లో పోల్చింది. నిశ్చయంగా అన్నిటికంటే బలహీనమైన ఇల్లు సాలెపురుగు ఇల్లే! మనుషులు ఇది తెలుసుకుంటే ఎంత బాగుండేది! ఏ విధంగానైతే సాలెపురుగు అల్లిన ఇల్లు బలహీనమైనదో! అదే విధంగా అల్లాహ్ (సు.తా)ను వదలి ఇతరులను ఆరాధించే వారి ఆరాధన కూడా వ్యర్థమైనదే. ఎందు కంటే ఆ దేవతలు తమను ఆరాధించే వారికి ఎలాంటి సహాయం చేయలేరు. వారు అల్లాహ్ వదిలి దేనిని ప్రార్థిస్తున్నారో, అల్లాహ్‌కు బాగా తెలుసు. అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

యూదులూ, క్రైస్తవులు దేవుళ్లని భావించే ఉ జైర్(అ.స) లేద ఈసా(అ.స) గానీ, లేక ముష్రికులు ఆరాధించే జిన్నాతులుగానీ, దైవ దూతలుగానీ, కల్పిత దైవాలుగానీ, విగ్రహాలుగానీ లేక పుణ్యవంతులైన ముస్లింలుగానీ, లేక ఇతర వలీలుగానీ కావచ్చు. వీరంతా తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందే మార్గాన్ని వెతుకుతున్నారు. అలాంటప్పుడు వారు ఇతరులకు ఏ విధంగా సహాయపడగలరు. వీరిని ఆరాధించటం మరియు వీరి సహాయం కోరటం షిర్క్. అల్లాహ్ (సు.తా) షిర్క్‌ను ఎన్నడూ క్షమించడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) హదీస్ ప్రకారం ప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉల్లేకించారు. హజ్-ఉమ్రా విధిని పూర్తి చేయండి. ఎందుకంటే బట్టిలో కాల్చి బంగారాన్ని మెరిపించినట్లు. మీ పేదరికం, పాపాలు తొలిగిపోతాయి. హజ్ చేసిన తరువాత అల్లాహ్ మీకు జన్నత్‌ను ప్రతిఫలంగా ప్రసాదిస్తాడు.

హజ్‌యాత్రకు వెళ్ళాలని మీరు నిర్ణయించుకున్నారు. అయితే ఎవరికి ఆహ్వానం ఇవ్వాలో అల్లా నిర్ణయించుకున్నాడు. ఏది జరిగినా అది అల్లా నిర్ణయం. ఈ ఏడాది మీకు హజ్‌కు వెళ్ళే అవకాశం రాలేదని అధైర్యపడకండి. వచ్చే ఏడాది ఆ అవకాశాన్ని అల్లా మీకు ప్రసాదిస్తాడు. అల్లా మీ నియత్ చూస్తాడు. ప్రపంచంలోని ముస్లింల అంతర్జాతీయ సమ్మేళనం హజ్. ఈ పవిత్ర కార్యక్రమానికి అందరూ వెళ్ళలేరు. కొంత మందికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. అల్లా ఆహ్వానం ఎవరికి లభించిందో వారే ముస్లింల ప్రతినిధుల్లా హజ్‌లో పాల్గొంటారు.

ప్రపంచ శాంతి, మానవుల మధ్య ప్రేమ, సత్‌సంబంధాలు పెంచడంలో హజ్ కీలక పాత్ర పోషిస్తుంది. మనిషి కల్పించుకున్న తరతమ భేదాలు, అంటరానితనం, సంప్రదాయాలకు విలువ లేదని అల్లా దృష్టిలో అందరూ సమానమనే నిజాన్ని హజ్‌యాత్ర చాటి చెబుతుంది. జాతి, సంస్కృతి, వర్ణం, వర్గం విభేదాలను, వివక్షలను రూపుమాపుతుంది. రాజు, సంపన్నుడు, నిరుపేద, బడుగుజీవి అందరూ ఒకరి పక్కన ఒకరు నడవక తప్పదు. వారు తమ మధ్య వున్న భేదాన్ని గుర్తించరు. దేవుని దృష్టిలో ఈ భేదాలకు ఎలాంటి విలువ లేదు. అలాంటప్పుడు మన నిత్యజీవితాల్లో వాటికి విలువ ఇవ్వడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. హజ్ యాత్రలో కనిపించే ఈ సమతుల్యాన్ని మన నిత్య జీవితాల్లో సాధించుకోవలసి ఉంటుంది. సమానత్వం, సమైక్యతలతో కూడుకున్న ఇస్లామీయ సముదాయం సామూహికంగా హజ్ చేస్తారు.

**- మహమ్మద్ లియాఖత్ అలీ**

చీఫ్ ఎడిటర్



లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హమ్‌ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీక లక

# పవిత్ర ఖుర్ఆన్ ఉపదేశం

## సూరతుల్ మాఊన్

- ముఫ్తి ముహమ్మద్ ఫారుఖ్ అల్ ఖాస్మీ

| | | |
|---|---|---|
| రుకూఉహా: (17) | సూరతుల్ మాఊన్ (107) | ఆయాతుహా |
| 1 | మక్కియ్యతున్ | 7 |

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

1.అరఐతల్లజీ యుకజ్జిబు బిద్దీన్. 2.ఫజాలికల్లజీ యదుఉల్ యతీమ్.

3.వలా యహుద్దూ అలా తామిల్ మిస్కీన్. 4.ఫవైలుల్లిల్ ముసల్లీన్.

5.అల్లజీన హుమ్ అన్ సలాతిహిమ్ సాహూన్. 6.అల్లజీన హుమ్ యురాఊన్. 7.వయమ్నఊనల్ మాఊన్

## సూరతుల్ మాఊన్

ఇది మక్కాలో అవతరించిన సూరహ్. ఇందులో 7 ఆయత్‌లు ఉన్నాయి. అమిత దయాళువు, అనంత ప్రేమమయుడు అయిన అల్లాహ్ పేరుతో...

1.తీర్పు దినాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? 2.అతడే అనాథలను కసరి కొట్టేవాడు. 3. మరియు పేదవారికి అన్నం పెట్టవలసిందిగా తాకీదు చేయనివాడు. 4, 5, 6, 7. ఇక తమ నమాజుల పట్ల ఏమరు పాటులో ఉండేవారి కొరకు, ప్రదర్శనాబుద్ధితో వ్యవహరించేవారి కొరకు మరియు వాడుకునే వస్తువులను (సైతం ప్రజలకు) ఇవ్వనివారి కొరకు వినాశనముంది.

### వ్యాఖ్యాన సారాంశం

తీర్పు దినాన్ని తిరస్కరించే వ్యక్తిని మీరు చూశారా? అటువంటి వ్యక్తి స్థితి గురించి వినాలనుకుంటే వినండి. ఆ వ్యక్తి అనాథలను కసరి కొడతాడు. మరియు పేదవారికి అన్నం పెట్టవలసిందిగా (ఇతరులకు సైతం) తాకీదు చేయడు. అనగా అతడు ఎంతటి కఠినాత్ముడంటే స్వయంగా తాను పేదవారికి ఇవ్వకపోవడమే కాకుండా ఇతరులను సైతం ప్రోత్సహించడు. దాసుల హక్కులను కాలరాచడమనేది ఇంతటి చెడ్డ విషయమయినప్పుడు ఇక సృష్టి కర్త అయిన అల్లాహ్ యొక్క హక్కును కాలరాచడమనేది మరింత చెడ్డ విషయం. కనుక (ఈ విధంగా నిరూపితమయిన విషయమేమిటంటే) తమ నమాజులను విస్మరించినవారి కొరకు (అనగా విడచి పెట్టేవారి కొరకు) వినాశనముంది. వారు నమాజ్ చదివే సమయంలో ప్రదర్శనాబుద్ధితో వ్యవహరిస్తారు. అలాగే వారు జకాత్‌ను ఎంత మాత్రం చెల్లించరు. (ఎందు కంటే జకాత్‌ను అందరి ముందు బహిరంగంగా చెల్లించవలసిందిగా ధర్మశాస్త్రీయ ఆదేశమేదీ లేదు. దానిని అసలు ఏమాత్రం చెల్లించకపోయినా ఎవరూ అభ్యంతర పెట్టరు కూడా. అయితే అందుకు విరుద్ధంగా నమాజ్ మాత్రం జమాఅత్ (ప్రజా సమూహం)తో పాటు బహిరంగంగా ఆచరించబడుతుంది. కనుక దానిని పూర్తిగా విడచిపెట్టిన పక్షంలో విడచిపెట్టిన వ్యక్తి యొక్క కాపట్యం బహిర్గతమవుతుంది. కనుక అటువంటి వ్యక్తి నమాజ్‌ను ప్రజల ముందు ప్రదర్శించే ఉద్దేశ్యంతో చదువుతాడు)

## సంగ్రహిత అంశములు మరియు నియమములు

ఈ సూరహ్‌లో అవిశ్వాసులు మరియు కపటులకు చెందిన పలు చెడ్డ ఆచరణల ప్రస్తావన మరియు వారికొరకు నరక సంబంధిత హెచ్చరిక ఉంది. ఒక వేళ ఈ ఆచరణలు తీర్పుదినాన్ని ధిక్కరించని ఏ విశ్వాసి నుంచి వెలువడినట్లయితే అవి ధర్మశాస్త్రం రీత్యా చెడ్డ ఆచరణలుగా, తీవ్రస్థాయి పాపకార్యాలుగా పరిగణించబడినప్పటికీ, పేర్కొనబడిన హెచ్చరిక అతడి కొరకు వర్తించదు. ఎందుకంటే ఈ ఆచరణలను ప్రస్తావించడానికి ముందు అల్లాహ్ ధర్మాన్ని మరియు తీర్పుదినాన్ని తిరస్కరించే వ్యక్తి గురించి ఈ సూరహ్‌లో ప్రస్తావించాడు. ఈ ప్రస్తావన తర్వాత ప్రస్తావించబడుతున్నవన్నీ, ఈ చెడ్డ ఆచరణలు విశ్వాసి యొక్క ఔన్నత్యానికి విరుద్ధమైనవి. అటువంటి చర్యలకు అవిశ్వాసి మాత్రమే పాల్పడగలడు. ఈ సూరహ్‌లో ప్రస్తావించబడిన చెడ్డ ఆచరణలు ఈ విధంగా ఉన్నాయి. (1) అనాథ పట్ల చెడ్డగా వ్యవహరించడం. (2) స్థోమత కలిగియున్నప్పటికీ పేదవానికి అన్నం పెట్టకపోవడం, మరియు ఇతరులనూ ప్రోత్సహించకపోవడం. (3) నమాజ్ చదివే విషయంలో ప్రదర్శనాబుద్ధిని కలిగియుండడం. (4) జకాత్ చెల్లించకపోవడం, అవిశ్వాసం మరియు ధిక్కారం ఫలితంగా ఈ చర్యలు వెలువడినట్లయితే వాటికి గాను శిక్ష శాశ్వత నరకమే. ఈ విషయం ఈ సూరహ్‌లో 'వైల్' అనే పదం స్పష్టం చేస్తుంది.

ఆ తర్వాత కపటుల గురించి పేర్కొనబడింది, అనగా వారు ప్రదర్శనాబుద్ధితో నమాజులను చదువుతారు కానీ వాస్తవానికి వారు నమాజ్, విధి అయిన ఆచరణ అనే విషయాన్నే విశ్వసించరని తెలియజేబడింది. అందుకే వారు నమాజ్ వేళల పట్ల మరియు స్వయంగా నమాజ్ పట్ల శ్రద్ధ వహించరు. ఎక్కడయితే ప్రజల ముందు ప్రదర్శించే అవకాశం లభిస్తుందో అక్కడ వారు నమాజ్‌ను చదువుతారు. లేకుంటే విడచిపెట్టేస్తారు. ఇది కపటుల ధోరణి అని పేర్కొనబడింది. ఆఖరి వాక్యంలో 'మాఊన్' అనే పదం పేర్కొనబడింది. 'మాఊన్' అనగా అల్పమయిన వస్తువు అని అర్థం. కనుక ఇక్కడ 'మాఊన్' అనగా 'ప్రజలు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే వాడుకునే వస్తువులు' అని భావం.

ఉదాహరణకు గొడ్డలి, పార, వంటపాత్రలు మొదలయినవి. వీటి కొరకు పొరుగువారికి అభ్యర్థించడం దోషంగా భావించబడదు. అలాగే వీటిని ఇచ్చేందుకు సైతం ఎవరూ సాధారణంగా వెనుకాడరు. కనుక ఇటువంటి వాడుకునే వస్తువులను సైతం ఇచ్చే విషయంలో పిసినారితనానికి పాల్పడే వ్యక్తి పరమ నీచుడయిన పిసినారిగా పరిగణించబడతాడు. కానీ ఈ సూరహ్ యొక్క ఆఖరి వాక్యంలో పేర్కొనబడిన 'మాఊన్' అనే పదానికి మాత్రం 'జకాత్' అని భావం. జకాత్‌ను మాఊన్' అని ఎందుకు పేర్కొనడం జరిగిందంటే అది పరిమాణం రీత్యా ఎంతో అల్పమయినది. అనగా కేవలం నలభయ్యవ వంతు మాత్రమే. హజ్రత్ అలీ(ర) ఇబ్నె ఉమర్(ర), హసన్ బసరీ(ర), ఖతాదహ్(ర) జిహాక్(ర) మొదలయిన ఖుర్ ఆన్ వ్యాఖ్యాతలందరూ ఈ వాక్యంలో 'మాఊన్' అనే పదానికి 'జకాత్' అని భావం అంటూనే వ్యాఖ్యానించారు.(మజ్‌హరీ) అలాగే 'జకాత్' ఇవ్వనందుకు 'వైల్' అనగా నరకం శిక్షగా విధించబడుతుందని పేర్కొనబడింది. విధి (ఫర్జ్)గా నిర్ణయించబడిన ఆచరణను విడనాడినందుకు మాత్రమే నరకలోకి ప్రవేశం శిక్షగా విధించబడేందుకు అవకాశముంది. ఇక వాడుకునే వస్తువులను ఇతరులకు ఇవ్వడమనేది ఎంతో పుణ్యకార్యమే కావచ్చు. మానవత్వం రీత్యా ఆవశ్యకమే కావచ్చు గానీ అది ఫర్జ్ (విధి) లేదా వాజిబ్ (తప్పనిసరి) ఆచరణ మాత్రం కాదు. వాటిని విడనాడినందుకు గాను నరకం శిక్షగా విధించబడేందకు ఇక ఏయే హదీసులలోనయితే ఇక్కడ 'మాఊన్' అనే పదానికి గాను 'వాడుకునే మామూలు వస్తువులు' అనే భావం వర్తిస్తుందని పేర్కొనబడినదో దాని విషయానికొస్తే అసలు భావం ఈ విధంగా ఉంది. అటువంటి వ్యక్తులు ఎంతటి కఠినాత్ములంటే వారు జకాత్ సంగతి అటుంచి కనీసం వాడుకునే మామూలు వస్తువులను సైతం ఇతరులకు ఇవ్వకుండా పిసినారితనాన్ని ప్రదర్శిస్తారు. కనుక నరక సంబంధింత హెచ్చరిక అటువంటి వాడుకునే మామూలు వస్తువులను వారు ప్రజలకు ఇవ్వని కారణంగా జారీ చేయబడలేదు. విధి (ఫర్జ్) కావించబడిన జకాత్‌ను చెల్లించకపోవడమే కాకుండా మరింత తీవ్రమైన స్థాయిలో పిసినారితనాన్ని వారు ప్రదర్శించిన కారణంగా మాత్రమే జారీ చేయబడింది. (అల్లాహ్ కే సర్వం ఎరుక).

# హజ్ ప్రయాణం ఇలా సాగుతుంది...

- డా.ఫజలుల్లాఖాన్

**ప్రవక్త ముహమ్మద్(స) హజ్ యాత్ర ఎలా చేశారు. హజ్ యాత్రను మనం ఎలా చేయాలి... ప్రశ్నా-సమాధానం రూపంలో తెలపడానికి ప్రయత్నించాను. ప్రతి హాజీకి తన హజ్ యాత్ర సునాయాసంగా చేసుకునే విధంగా క్రమ పద్ధతిలో వివరణ ఇందులో వుంది.**

**ప్ర:హజ్ అంటే ఏమిటి?**

జ: హజ్ యాత్ర కొరకు సంకల్పం చేసుకోవడం. "వలిల్లాహి అలన్నాసి హిజ్జుల్ బైతి మనిస్ త తాఅ ఇలైహి సబీలా" దేవుని ప్రసన్నత పొందడానికి స్తోమత ఉన్న ప్రజలు హజ్‌యాత్ర విధిగా చేయాలని సూరె అలి ఇమ్రాన్‌లోని 97వ ఆయత్‌లో ఆదేశించడం జరిగింది. హజ్ ఎవరిపై తప్పనిసరి అంటే, ముస్లిం అయి వుండాలి. యువకుడై వుండాలి. మానసికస్థితి బాగుండాలి. ఆరోగ్యంగా వుండాలి. హజ్ కోసం రవాణా ఖర్చులు, ఇతర ఖర్చులకు అవసరమైన డబ్బు అతని వద్ద వుండాలి. భర్త లేదా మహరమ్, బంధువులు హజ్‌కు వెళ్ళేటప్పుడు, అలాంటి స్థితిలో మహిళపై హజ్ తప్పని సరి అవుతుంది. ముందు కూతురి పెళ్ళి చేసి ఆ తరువాతే హజ్ చేయాలనే ఆలోచనతో చాలా మంది వుంటారు. అయితే అలాంటి అభిప్రాయం సరి కాదు. మీ దగ్గర హజ్‌కు వెళ్ళే స్థోమత (భార్యా పిలల్ల పోషణకు కావాల్సిన వాటిని సమకూర్చడం, కాబా గృహం వద్దకు చేరుటకు కావలసినంత ధనం కలిగి ఉన్నవారు అని అర్థం) వుంటే వెంటనే హజ్ విధిని నిర్వర్తించాల్సిన బాధ్యత మీపైన ఉంది.

**ప్ర:హజ్‌లో మూడు రకాలేమిటి?**

జ: హజ్జె ఇఫ్రాద్, హజ్జె ఖిరాన్, హజ్జె తమత్తు.

హజ్జె ఇఫ్రాద్ అంటే - హజ్ దినాల్లో ఇహ్రామ్ ధరించి, కేవలం హజ్ చేస్తున్నానని సంకల్పం చేసుకుని, హజ్ కార్యాలు ముగించుకున్న తర్వాత ఇహ్రామ్ తొలగించుకోవడం.

హజ్జె ఖిరాన్ అంటే - ఈ విధానంలో హజ్, ఉమ్రా కోసం ఒకే సారి సంకల్పం చేసుకోవాలి. మొదట ఉమ్రా పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత అదే ఇహ్రామ్‌తో హజ్ దినాల్లో హజ్ ముగించుకుని ఇహ్రామ్ విప్పుతారు.

హజ్జె తమత్తు అంటే - ఈ విధానంలో ఉమ్రా కోసం ఇహ్రామ్ ధరించి ఉమ్రా పూర్తి చేసుకోవాలి. ఉమ్రా పూర్తి అయిన తర్వాత ఇహ్రామ్ వస్త్రాలు తొలగించి ఇహ్రామ్ నిబంధనల నుంచి విముక్తులవుతారు. మళ్ళీ జిల్‌హజ్ ఎనిమిదో తేదీన హజ్ కొరకు సంకల్పం చేసుకుని ఇహ్రామ్ ధరించి హజ్ కార్యక్రమాలు నెరవేర్చి ఇహ్రామ్ విప్పుతారు.

**ప్ర:ప్రవక్త(స) హజ్‌కు బయలుదేరినప్పుడు ఆయనతోడు ఎందరు సతీమణులు వెళ్ళారు?**

జ: ఆ సమయంలో సజీవంగా వున్నవారందరూ వెళ్ళారు.

**ప్ర:మీఖాత్ అంటే ఏమిటి? వాటి పేర్లు?**

జ: హజ్, ఉమ్రా చేయడానికి వచ్చే వారి కోసం మక్కా సరిహద్దు ప్రాంతాల్లో ఇహ్రామ్ ధరించేందుకు నిర్ణయించబడిన ప్రత్యేక ప్రాంతాలను మీఖాత్ అంటారు. జూరాన, తన్‌యీమ్, హుదైబియా, యలమ్‌లమ్, జుల్‌హులైఫా, హుజ్ఫ, ఖర్‌నుల్ మనాజిల్, జాతె అరఖ్

**ప్ర:పురుషుల ఇహ్రామ్ - స్త్రీల ఇహ్రామ్ కోసం ఎన్ని వస్త్రాలు ఉపయోగించాలి?**

జ: పురుషులు రెండున్నర గజాల పొడవు, ఒకటింపావు గజం వెడల్పు గల రెండు వస్త్రాలు ఉపయోగించాలి. ఒకటి లుంగీలాగ నడుంకు చుట్టుకుని, రెండవది భుజాల మీద కప్పుకోవాలి.

స్త్రీలు తలకు చుట్టుకోవడానికి ఒక రుమాలు. రోజువారి వస్త్రాలు. కాషాయం లేనివి.

**ప్ర:ఇహ్రామ్ ధరించక ముందు ఏం చేయాలి?**

జ: మీసాలు కత్తిరించాలి. గోళ్లు కత్తిరించుకోవాలి. నాభి క్రింది వెంట్రుకలు తొలగించుకోవాలి. చంకల్లోని వెంట్రుకలు కత్తిరించుకోవాలి. గుస్ల్ (స్నానం) చేయాలి.

**ప్ర:ఇహ్రామ్ ధరించి ఏం చేయాలి?**

జ: రెండు రకాతుల నమాజ్ చేయాలి. 3 సార్లు తల్బియా పఠించాలి. ఇప్పుడు మీరు ముహ్రిమ్ అని అనబడతారు. తల్బియా పఠిస్తూ వుండాలి.

**ప్ర:ప్రవక్త(స) కాబా గృహంలోకి ప్రవేశించే ముందు ఏం చేశారు?**

జ: గుస్ల్ (స్నానం) చేశారు.

**ప్ర: ప్రవక్త(స) ఏ ద్వారం ద్వారా మస్జిదెహరామ్‌లోకి ప్రవేశించారు?**

జ: సలామ్ ద్వారం ద్వారా కుడికాలు పెట్టి "అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ జునూబి వస్‌తహ్‌లీ అబ్వాబ రహ్‌మతిక" అంటూ ప్రవేశించారు. ముహ్రిమ్ వుజూ స్థితిలో వుండాలి. కాబాపై దృష్టి పడిన వెంటనే జీవితంలో చేసే ప్రతి దుఆను స్వీకరించమని అల్లాహ్‌తో వేడుకోండి. ఆ తరువాత కాబా తవాఫ్ చేయండి.

**ప్ర: కాబా గృహం నలుమూలల పేర్లు?**

జ: దీర్ఘచతురస్రాకారంలో ఉన్న కాబా ఈశాన్యమూలను రుకునె ఇరాఖీ, వాయువ్య మూలని రుకునే షామీ, నైరుతి మూలను రుకునె యమనీ, ఆగ్నేయ మూలను రుకునె సూద్ అంటారు.

**ప్ర: కాబా ద్వారం ఏ దిశలో ఉంది?**

హజ్రె అస్వద్‌కు కుడివైపు

**ప్ర:హతీమ్ ఎక్కడుంది?**

జ: ఈశాన్యం, నైరుతి మూలల ముందు ఉన్న గోడ లోపలి భాగమే హతీమ్. పైకప్పు పైన చేరే నీరు క్రిందపడేందుకు అమర్చిన గొట్టం ఉన్న గోడకు ముందు ఉన్న మరో గోడ లోపలి భాగంలో హతీమ్ ఉంది.

**ప్ర:తవాఫ్ అంటే ఏమిటి?**

జ: కాబా గృహం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణాలు చేయడాన్ని తవాఫ్ అంటారు. తవాఫ్ చేయాలనుకునే వ్యక్తి వుజూ స్థితిలో ఉండాలి. పరిశుభ్రంగా ఉండాలి. స్త్రీలయితే బహిష్టు, పురిటి రక్తస్రావం వంటి వాటి నుంచి కూడా పరిశుభ్రంగా ఉండాలి.

**ప్ర:ఇజ్తిబా అంటే ఏమిటి?**

జ: ఇజ్తిబా పురుషుల కోసం సున్నత్. స్త్రీల కొరకు కాదు. ఇహ్రామ్‌లో పైన ధరించే వస్త్రం మధ్యభాగం కుడి చంక క్రింద నుండి పైకి తీసుకొచ్చి వస్త్రం రెండు కొనలు కుడిభుజం కనబడేటట్టు ఎడమ భుజంపై వేయాలి.

**ప్ర:తవాఫ్ సంకల్పం ఎలా చేసుకోవాలి?**

జ: ముహ్రిమ్ ఇజ్తిబా స్థితిలో కాబా గృహం ముందు తన కుడిభుజం హజ్రెఅస్వద్‌కు ఎడమవైపు ఉండేలా నిలబడి తవాఫ్ సంకల్పం చేసుకోవాలి.

**ప్ర:ఇజ్తిలామ్ చేయడం అంటే ఏమిటి? ఏ విధంగా చేయాలి?**

జ: హజ్రె అస్వద్‌ను తాకడాన్ని, చుమ్మించడాన్ని ఇజ్తిలామ్ అంటారు. హజ్రె అస్వద్‌ను చూసి తవాఫ్ సంకల్పం చేసుకున్న తర్వాత దాని ముందుకు రావాలి. 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అంటూ రెండు చేతులను చెవుల వరకు లేపి వదిలి పెట్టాలి. అవసరమనిపిస్తే రెండు చేతులను హజ్రె అస్వద్‌పై పెట్టి రెండు చేతుల మధ్య తలపెట్టి మెల్లగా దాన్ని చుమ్మించాలి. హజ్రె అస్వద్‌ను దర్శించుకుంటూ తన కుడివైపు తిరుగుతూ తవాఫ్ ప్రారంభించాలి. కాబా ద్వారం, హతీమ్‌లు మీకు ఎడమ వైపు వుంటుంది.

**ప్ర:ప్రవక్త(స) తవాఫ్ చేస్తూ ఏం చేశారు?**

జ: తవాఫ్‌లోని మొదటి మూడు ప్రదక్షిణలు (రమ్ల్ చేస్తూ) త్వరత్వరగా ముగించుకుని మిగతా నాలుగు ప్రదక్షిణలు మామూలు వేగంతో చేశారు. అన్ని ప్రదక్షిణలు ఇజ్తిబా స్థితిలోనే చేశారు.

**ప్ర:రమ్ల్ అంటే ఏమిటి?**

జ: భుజాలు కదుపుతూదగ్గర దగ్గరగా అడుగులేస్తూ వేగంగా నడిచే ప్రక్రియను రమ్ల్ అంటారు.

**ప్ర:ప్రవక్త(స) తవాఫ్ ప్రారంభించి రుక్నె యమానీ వద్ద ఏం చేశారు?**

జ: ప్రవక్త(స) రుక్నె యమానీని తాకారు. చుమ్మించలేదు. చేతులతో తాకారు. ఆ చేతులను మళ్లీ పెదాలతో చుమ్మించలేదు. తవాఫ్ లోని ప్రతి ప్రదక్షిణ హజ్రె అస్వద్‌తో మొదలై అక్కడే పూర్తవుతుంది. రెండు చేతులను హజ్రె అస్వద్‌కు చూపిస్తూ రెండు చేతులను ముద్దాడాలి. తవాఫ్‌లో 4 ప్రదక్షిణలు ఫర్జ్. మూడు వాజిబ్.

**ప్ర:ఏడు ప్రదక్షిణలు పూర్తి చేసుకుని ప్రవక్త(స) ఏం చేశారు?**

జ: హజ్రె అస్వద్‌ను ఎనిమిదో సారి చుమ్మించారు. మఖామె ఇబ్రాహీం వద్దకు వెళ్ళారు. ఇజ్తిబా స్థితిలోనే రెండు రకాతుల నమాజ్ చేశారు. ముల్తజిమ్ వద్దకు వెళ్ళి ముల్తజిమ్‌ను హత్తుకుని తన రెండు చేతులు చాచి దుఆ చేశారు. ఆ తరువాత జమ్ జమ్ బావి వద్దకు వెళ్ళి జమ్ జమ్ నీటిని ఆగుతూ మూడు శ్వాసల్లో సేవించారు. ఓ అల్లాహ్ నాకు లాభదాయకమైన విద్యను ప్రసాదించు. విస్తృత ఉపాధిని ఇవ్వు. ప్రతి వ్యాధి నుంచి విముక్తి కలిగించు అంటూ దుఆ చేశారు. ఆ తరువాత హజ్రె అస్వద్‌ను తొమ్మిదోసారి చుంబించి సఫా మర్వాల మధ్య సయీ చేయాలని నిర్ణయించుకున్నారు.

**ప్ర:సయీ చేయడం అంటే ఏమిటి?**

జ: సఫా, మర్వాలు మస్జిదె హరమ్ ముందు ఉన్న చిన్న పర్వతగుట్టలు. వాటి మధ్య ఏడు సార్లు పరుగెత్తే ప్రత్యేక ప్రక్రియను సయీ అంటారు. ముహ్రిమ్ సఫా వద్దకు చేరుకుని సంకల్పం చేసుకోవాలి. కాబా గృహం వైపుకు తిరిగి రెండు చేతులు దుఆ చేస్తున్నట్లు పైకెత్తి సంకల్పం చేసుకోవాలి. "ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షఆయిరిల్లాహ్' ఆయత్ పఠించండి. సఫా మర్వాల మధ్య గ్రీన్ లైట్ వున్న ప్రాంతంలో పురుషులు పరుగెత్తాలి. మహిళలు సాధారణ నడకతోనే నడవాలి. సఫా నుంచి మర్వా 1, మర్వా నుంచి సఫా 2, సఫా నుంచి మర్వా 3, మర్వా నుంచి సఫా 4, సఫా నుంచి మర్వా 5, మర్వా నుంచి సఫా 6, సఫా నుంచి మర్వా 7, మర్వా వద్ద సయీ పూర్తి అవుతుంది. మర్వా వద్దే రెండు రకాతుల నమాజ్ చేసుకోవాలి. ఆ తరువాత గుండు లేదా వెంట్రుకలు చిన్నవిగా చేయించుకోవచ్చు.

**ప్ర:ముల్తజిమ్ ప్రాంతం ఎక్కడుంది?**

జ: హజ్రె అస్వద్, కాబా కూడలి మధ్య

**ప్ర:మతాఫ్ అంటే ఏమిటి?**

జ: బైతుల్లాహ్ (కాబా గృహం) నలువైపుల తవాఫ్ చేసే ప్రదేశం.

**ప్ర:ఖారిన్ అంటే ఎవరు?**

జ: హజ్ మరియు ఉమ్రా ఒకేసారి చేయడాలని సంకల్పించుకుని ఇహ్రామ్ ధరించిన వ్యక్తిని ఖారిన్ అంటారు.:

**ప్ర:ముఫ్రద్ అంటే ఎవరు?**

జ: కేవలం హజ్ చేసే సంకల్పంతో ఇహ్రామ్ ధరించే వ్యక్తిని 'ముఫ్రద్' అంటారు.

**ప్ర:నఫిల్ తవాఫ్‌లో రమ్ల్, ఇజ్తిబా వుంటాయా?**

జ: రమ్ల్, ఇజ్తిబా లేకుండానే నఫిల్ తవాఫ్‌లు చేయాలి. ఇహ్రామ్ కూడా ధరించనవసరం లేదు. తవాఫ్ తరువాత నమాజ్ చేయడం తప్పనిసరి.

**ప్ర:మక్కా నగరానికి మీనా ఏ దిక్కున ఉంది?**

జ: తూర్పు వైపున

**ప్ర:మక్కా నగరం నుంచి మీనా ఎన్ని కి.మీ దూరంలో ఉంది?**

జ: 8 కి.మీ.

**ప్ర:మీనాకు గల ప్రత్యేకత ఏమిటి?**

జ: ఇబ్రహీం(అలై) అల్లాహ్ ఆజ్ఞతో తన ప్రియ కుమారుడు ఇస్మాయిల్(అ)ను జిబహ్ చేసే ఉద్దేశంతో మీనా ప్రాంతానికి తీసుకెళ్ళారు.

**ప్ర:ప్రవక్త జిల్‌హజ్ 8వ తేదీ మీనాలో ఏఏ నమాజ్‌లు చేశారు?**

జ: జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా, తొమ్మిదో తేదీన నమాజె ఫజర్ చేశారు.

**ప్ర:అరఫాత్ మైదానం మక్కా నగరానికి ఎటువైపు ఉంది?**

జ: మక్కాకు, మీనాకు తూర్పు వైపున

**ప్ర: మీనా నుంచి అరఫాత్ ఎన్ని కి.మీ. దూరంలో ఉంది?**

జ: 13 కి.మీ.దూరం.

జిల్ హజ్ 8వ తేదీ తెల్లవారుఝామున మీనా నుంచి అరఫాత్‌కు ప్రయాణం. అరఫాత్ మైదానంలో ఇబ్రాహీ(అ) నిర్మించిన ఒక మస్జిద్ ఉంది. ఆ మస్జిద్‌కు మస్జిదె ఇబ్రాహీం, లేదా మస్జిదె నమ్రా అంటారు. జుహ్ర్ నమాజ్‌తో పాటు అసర్ నమాజ్ కూడా పూర్తి చేసుకోవాలి. సూర్యాస్తమయం వరకు అరఫాత్‌లోనే ఉండాలి. ఖిబ్లా వైపు తిరిగి అల్లాహ్‌ను స్తుతించాలి. దరూద్ పఠించాలి. దుఆలు చేయాలి. తల్బియా ఉచ్ఛరిస్తూ ఉండాలి. అరఫాత్‌లో బస చేయడమే హజ్.

**ప్ర:ప్రవక్త(స) సూర్యాస్తమయానికి ముందు ఏం చేశారు?**

జ: గుస్ల్ (స్నానం) చేశారు.

**ప్ర:వుఖూపె అరఫాత్ అంటే ఏమిటి?**

జ: వుఖూఫ్ అంటే బస చేయడం. అరఫాత్ మైదానంలో జవాల్ (సూర్యుడు నడినెత్తి మీద వచ్చినప్పటి) నుండి సూర్యాస్తమయం వరకు ఉండటాన్ని వుఖూఫె అరఫాత్ అంటారు. జిల్‌హజ్ తొమ్మిదో తేదీ మధ్యాహ్నం నుండి సూర్యాస్తమయం తరువాత మగ్రిబ్ నమాజ్ చేయకుండా ముజ్దలిఫాకు తల్బియా, తక్బీర్, దరూద్‌లు పఠిస్తూ వెళ్ళాలి.

**ప్ర:ముజ్దలిఫా ఎక్కడుంది?**

జ: అరఫాత్ నుంచి ముజ్దలిఫా 13 కి.మీ దూరంలో వుంది. అరఫాత్ మరియు మీనా మధ్య భాగంలో వున్న సువిశాల ప్రాంతాన్నే ముజ్దలిఫా అంటారు. అరఫాత్ నుంచి ముజ్దలిఫా చేరుకొని మగ్రిబ్, ఇషా నమాజ్ చదువుకోవాలి. రాత్రి అక్కడ జాగరణ చేయాలి. ముజ్దలిఫా రాత్రి షబె ఖద్ర్ కంటే మేలైంది. ఖిబ్లా వైపు తిరిగి తక్బీర్, ఇస్తిగఫార్, తల్బియా,

దరూద్ అధికంగా చదవాలి. 70 కంకర రాళ్ళు సేకరించుకోవాలి. జిల్‌హజ్ 10వ తేదీ ఫజర్ నమాజ్ చదివి, సూర్యోదయం తర్వాత కొంత సేపటి వరకు ముజ్దలిఫాలోనే వుండాలి. దీన్ని వుఖూఫె ముజ్దలిఫా అంటారు.

**ప్ర:ముహస్సిర్ ప్రాంతం ఎక్కడుంది?**

జ: ప్రవక్త(స) జన్మించక ముందు కాబా గృహాన్ని కూల్చే ఉద్దేశంతో అబ్రహా అతని సైనికులొచ్చారు. అల్లాహ్ ఈ ప్రాంతంలో అబాబీల్ పిట్టల ద్వారా వారిపైన తన శిక్షను అవతరింప చేశాడు. దీని ప్రస్తావన సూరెఫీల్‌లో ఉంది.

**ప్ర:ముజ్దలిఫా నుంచి మీనా ఎంత దూరంలో వుంది?**

జ: 4 కి.మీ. దూరంలో వుంది.

**ప్ర:షైతాన్‌పై రాళ్ళు ఎప్పుడు వేయాలి?**

జ: ముజ్దలిఫా నుంచి మీనా టెంట్‌కు వెళ్ళండి. జుహర్ నమాజ్ మీనా టెంట్‌లో పూర్తి చేసుకొని రమి చేయడానికి వెళ్ళండి. జిల్ హజ్ పదో తేదీ సూర్యోదయం నుండి సూర్యుడు నడినెత్తి నుండి కిందికి వాలే వరకు షైతాన్‌పై రాళ్ళు విసరడం సున్నత్. అప్పటి నుండి సూర్యాస్తమయం వరకు విసరడం అభిలషణీయం. సూర్యాస్తమయం నుండి రెండో రోజు ఫజర్ వరకు విసరడం మక్రూహ్. ప్రవక్త(స) సూర్యుడు నడినెత్తి నుండి వాలే ముందు జమ్రతుల్ ఉఖ్‌బాపై రాళ్ళు విసిరారు. ప్రవక్త(స) రమీ చేస్తూ ఇలా పఠించారు. "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్, రగ్‌మన్ లిల్ షైతాని వ రజన్ లిల్ రహ్మాన్" రమీ చేసేటప్పుడు రాళ్ళను కుడిచేయి బొటన వ్రేలు, చూపుడు వేళ్ళతో, లేదంటే ఎలా అయినా పట్టుకోవచ్చు.

**ప్ర:మీనా నుంచి జమరాత్ ఎంత దూరంలో వుంది?**

జ: 3 కి.మీ. దూరంలో వుంది.

**ప్ర:రాళ్ళు విసిరేటప్పుడు ఎలా నిలబడాలి?**

జ: హాజి కుడిభుజం మీనావైపు, ఎడమ భుజం కాబా వైపు ఉండేలా జమ్‌ర ముందు నించోవాలి.

**ప్ర:ప్రవక్త ఎన్ని ఒంటెల్ని ఖుర్బానీ చేశారు?**

జ: ప్రవక్త(స) హజ్ చేసేటప్పుడు ఆయనకు 63 సంవత్సరాలు. అందుకుగాను జీవవితంలోని ప్రతి సంవత్సరానికి కృతజ్ఞతగా 63 ఒంటెలను తన చేతులతో జిబహ్ చేశారు.

**ప్ర:ప్రవక్త(స) తన సతీమణుల తరఫు నుండి ఎన్ని జంతువులను జిబహ్ చేశారు?**

ఒక జంతువు ఆయిషా(ర) తరఫున, మరో జంతువు సతీమణులందరి తరఫు నుండి.

షైతాన్‌పై రాళ్ళు విసిరిన తరువాత ఖుర్బానీ చేయాలి. బ్యాంక్‌లో ఖుర్బానీ డబ్బు చెల్లించారు కాబట్టి మీ ఖుర్బానీ అయిపోతుంది. కాబట్టి మీరు గుండు చేయించుకోవాలి.

**ప్ర:తహల్లుల్ అంటే ఏమిటి?**

జ: హాజీ ఇహ్రామ్ ధరించి ఉన్నప్పుడు అతనిపై కొన్ని వస్తువులు నిషేధం అవుతాయి. హాజీ తల గొరిగించుకున్న తర్వాత సంభోగించడం, వేటాడం తప్ప అన్నీ ధర్మసమ్మతమవుతాయి. సమ్మతమయ్యే ప్రక్రియను తహల్లుల్ అంటారు.

**ప్ర:తల వెంట్రుకలు తీయించుకున్న తర్వాత ప్రవక్త ఎక్కడకు వెళ్ళారు?**

జ: తల వెంట్రుకలు తీయించుకున్న తర్వాత ప్రవక్త ఇహ్రామ్ తీసేశారు. తవాఫే జియారత్ చేయడానికి మక్కా నగరానికి వెళ్ళారు. ప్రవక్త(స) కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలతో తవాఫ్ చేశారు. మొదటి మూడు చుట్లలో రమీ చేశారు. మిగతా చుట్లలో రమీ చేయలేదు.

**ప్ర:హాజీ రెండో తహల్లుల్ ఎప్పుడు పొందుతాడు?**

జ: తవాఫే జియారత్ చేసిన తర్వాత. హాజీ భార్యతో సంభోగించడం, వేటాడటం ధర్మసమ్మతమవడాన్ని రెండో తహల్లుల్ అంటారు.

**ప్ర:ప్రవక్త(స) తవాఫే జియారత్ చేసిన తర్వాత ఏం చేశారు?**

జ: జమ్‌జమ్ బావి దగ్గరకు వెళ్ళి రెండు రకాతులు నమాజ్ చేశారు. ఆ తరువాత మీనాకు వెళ్ళారు.

**ప్ర:తష్రీక్ రోజుల్లో ప్రవక్త ఎక్కడున్నారు?**

జ: జిల్‌హజ్ తొమ్మిదో తేదీ నుంచి పదమూడో తేదీ వరకు ఐదు రోజులను తష్రీక్ రోజులంటారు. ఈ ఐదు రోజుల్లో తక్బీరె తష్రీక్‌లు పఠిస్తారు. అందుకనే ఈ ఐదు రోజులను 'అయ్యామె తష్రీక్' అంటారు. ఫర్జ్ నమాజ్ తర్వాత "అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్".

**ప్ర: జిల్‌హజ్ 11, 12 తేదీల్లో షైతాన్‌పై ఎప్పుడు రాళ్ళు రువ్వాలి?**

జ: జిల్‌హజ్ 11, 12 తేదీల్లో మధ్యాహ్నం నుండి సూర్యాస్తమయం వరకు మూడు షైతాన్‌లపై రాళ్ళు విసరడం సున్నత్. రెండో రోజు ఉదయం వరకు మక్రూహ్. ఆ తర్వాత ఖజా మరియు పరిహారం అంటే దమ్ (తప్పనిసరిగా ఇవ్వాలి),

**ప్ర:ప్రవక్త(స) మూడు షైతాన్‌లపై ఎన్ని కంకర రాళ్ళు విసిరారు?**

జ: వుజూ తప్పనిసరిగా చేసుకొని (వుజూతో వుండటం తప్పని సరి) ఒక్కోక్క షైతాన్‌పై ఏడు రాళ్ళు విడి విడిగా విసిరారు. 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్" తక్బీర్ పఠిస్తూ రాళ్ళు విసిరారు. ఆ తరువాత అల్లాహ్‌ను స్తుతిస్తూ తక్బీర్లు పఠిస్తూ లీనమైయ్యారు. ఇలా మూడు షైతాన్‌లపై రాళ్ళు వేసే హజ్ యొక్క వాజిబ్‌ను పూర్తి చేశారు. (జమ్రె ఊలా, జమ్రె ఉస్తా, జమ్రె ఉఖ్బా ఈ మూడు షైతాన్‌లపై ఏడేడు చొప్పున 21 రాళ్ళు విసిరారు. ఆ తరువాత వెంటనే మీనాకు వెళ్ళిపోయారు.

**ప్ర:జిల్ హజ్ 12వ తేదీ రమీ (షైతాన్‌పై రాళ్ళు వేయడం) ఎలా చేయాలి?**

జ: జిల్ హజ్ 11వ తేదీ చేసిన విధంగానే. (జిల్‌హజ్ 12వ తేదీన హాజీలను మక్కాకు వెళ్ళడానికి అనుమతినిచ్చారు) ప్రవక్త(స) 13వ తేదీన కూడా ఉండి రమీ చేశారు.

**ప్ర:జిల్ హజ్ 13వ తేదీ ప్రవక్త(స) జమ్రతుస్సలాసపై(షైతాన్‌లపై) ఎన్ని రాళ్లు విసిరారు?**

జ: 21 రాళ్ళు. సూర్యాస్తమయం వరకు మూడు జమ్రాలను రమీ చేయడం (రాళ్ళు విసరడం) తప్పనిసరి. సూర్యాస్తమయం తర్వాత రమీ చేసే సమయం పూర్తవుతుంది. దానికి ఖజా లేదు. రమీ చేయకుండా పోతే తప్పనిసరిగా పరిహారం చెల్లించాలి.

**ప్ర:ప్రవక్త(స) జిల్‌హజ్ 11, 12, 13 తేదీల్లో జమ్రతుస్సలాసకు మొత్తం ఎన్ని రాళ్ళు విసిరారు?**

జ: 21÷21÷21=63 (10వ తేదీ పెద్ద షైతాన్‌పై 7 రాళ్ళు కలుపుకొని మొత్తం 70)

**ప్ర:షైతాన్‌కు రాళ్ళు కొట్టే ప్రక్రియ ఏ సంఘటనతో సంబంధం వుంది?**

జ: జమ్రతుస్సలాసను రాళ్ళు కొట్టడం ఇబ్రాహీం(అ) ఆచరణ స్మృతి చిహ్నం. ఆయన అల్లాహ్ ఆదేశం మేరకు హజ్రత్ ఇస్మాయిల్(అ)ను జిబహ్ చేసే ఉద్దేశంతో మీనాకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో షైతాన్ ఇబ్రాహీం(అ)ను మూడు చోట్ల తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించాడు. ఇబ్రాహీం(అ) షైతాన్‌ను రాళ్ళతో కొట్టి తరిమారు.

**ప్ర:స్త్రీలు, వృద్ధులు, రోగగ్రస్థులు, బలహీనులు అధిక సమూహానికి భయపడితే అలాంటి వారు ఎప్పుడు రమీ (షైతాన్‌పై రాళ్ళు) వేయాలి?**

జ: జిల్ హజ్ 10వ తేదీ: సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత
జిల్ హజ్ 11వ తేదీ: సూర్యాస్తమయం తర్వాత, శుభోదయం ముందు
జిల్ హజ్ 12వ తేదీ: సూర్యాస్తమయం తర్వాత, శుభోదయం ముందు

**ప్ర:ప్రవక్త(స) తవాఫ్ (తవాఫె విదా) ఎప్పుడు చేశారు?**

జ: ఫర్జ్ నమాజ్ కంటే ముందు. (మక్కా నుండి వెళ్ళే లోపు ఎప్పుడైనా చేయవచ్చు. కానీ తవాఫె విదా కూడా హజ్ లో తప్పనిసరి (వాజిబ్). ఏదైనా కారణంతో తవాఫె విదా చేయకపోతే హజ్ పూర్తి కాదు. వాజిబ్ వదిలినందుకు తప్పనిసరిగా ఒక జంతువును ఖుర్బానీ ఇవ్వాలి) బహిష్టు, పురుటి రక్తస్రావం కలిగిన మహిళలకు తవాఫె విదా నుంచి వెసులుబాటు వుంది.

**ప్ర:దమ్ అంటే ఏమిటి? ఎప్పుడు తప్పనిసరి?**

జ: హజ్ ప్రక్రియలో జరిగిన తప్పిదాల వల్ల పరిహారంగా ఇచ్చే ఖుర్బానీని దమ్మె కప్పారా' అంటారు. పరిహారంగా ఒక మేక, గొర్రె, పొట్టేలు, ఒంటె, ఆవు ఖుర్బానీ ఇవ్వాలి.

**ప్ర:సద్ఖా ఎప్పుడు తప్పనిసరి?**

జ: వజూ లేకుండా తవాఫె చేసినప్పుడు, తవాఫ్‌లో కానీ, సయీలో కాని కొన్ని ప్రదక్షిణలను విడిచిపెట్టినప్పుడు. షైతాన్‌పై రాళ్ళు ఏడు రాళ్ళ కంటే తక్కువ కొట్టినప్పుడు సద్ఖా చెల్లించాలి.

# తెలుసుకోవాల్సిన అరబీ పదాలు

| | | | |
|---|---|---|---|
| ఒకటి | వాహిద్ | అతను | హువ |
| రెండు | ఇస్ నైన్ | నాకు తెలియదు | అన మాఫి మాలూమ్ |
| మూడు | తలాత | నాదగ్గర డబ్బు ఉంది | అన పీ ఫులుస్ |
| నాలుగు | అర్బా | ఎంత వుంది డబ్బు | చమ్ పి ఫులుస్ |
| ఐదు | ఖమ్‌స | నాదగ్గర ఒక దీనార్ ఉంది | అన పి వాహేట్ దీనార్ |
| ఆరు | సిత్తా | ఓకే రా వెళ్లాదాము | ఓకే ఎల్లా తాల్ |
| ఏడు | సబ్అ | ఎక్కడికి వెళ్ళాలి మామ | వేన్ ఎబి రో మామ |
| ఎనిమిది | తమానియ | నేను మార్కెట్ కి పోవాలి | అన ఎబి రో సూక్ |
| తొమ్మిది | తిస్ఆ | రాజు టిఫిన్ చేశావా | రాజు కాలాస్ రియ్యుక్ |
| పది | ఆష్రా | నేను టిపిన్ తినలేదు మామ | అన మాఫీ అఖిల్ రియ్యుక్ |
| రెస్టారెంట్ | మతామ్ | హెూటల్‌వెళ్లి సమున్ తిను | రో మతామ్ అఖిల్ సమున్ |
| చెక్కెర | సుక్కర్ | ఇప్పుడే వేళ్ళు హెూటల్ కి | అలిహిన్ రో మతామ్ |
| తేనె | అస్ల్ | ఇప్పుడే వస్తున్నా | అలిహిన్ ఈజీ |
| మాంసం | లహమ్ | ఇప్పుడే రాలేను | అలిహిన్ మై ఈజీ |
| నేను | అన | ఎందుకు రావటం లేదు | లెస్ మై ఈజీ |
| ఇది | హాజా | నాకు పని ఉంది | అన పి సుగల్ |
| ఇక్కడ | హినా | ఓకే త్వరగా రా | ఓకే తాల్ సురా |
| నీవు | అంత | టిఫిన్ చేశేశావా | కాలాస్ రియ్యుక్ |

# హజ్ విధి - నిబంధనలు

-ముఫ్తి ముహమ్మద్ ఇస్మాయిల్ ఖాశిమీ,

లబ్బీపేట, విజయవాడ

అల్లాహ్‌ను ఏకైక విశ్వ ఆరాధ్యునిగా నమ్మి కేవలం అల్లానే ఆరాధిస్తూ కల్మా చదివి, ముస్లింగా మారిన వ్యక్తికి దినానికి ఐదు సార్లు నమాజ్ చేయడం, ఉపవాసాలుండటం. జకాత్ ఇవ్వడం, జీవితంలో కనీసం ఒక సారి హజ్ చేయడం. ఇలాంటి ఎన్నో హదీసులున్నాయి. అందులో దైవప్రవక్త ముహమ్మద్(స) ఈ ఐదు అంశాలు ఇస్లాం యొక్క ఐదు పిల్లర్లని తెలిపారు. హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు. ఇస్లాం ఫౌండేషన్ ఐదు పిల్లర్లపై వుంది. ఆరాధించడానికి అల్లాహ్ తప్ప దైవం మరేదీ లేదని, మరియు ముహమ్మద్(స) అల్లాహ్ ద్వారా పంపబడిన దైవప్రవక్త అని సాక్ష్యమిస్తున్నా. నమాజ్ చదవడం, జకాత్ ఇవ్వడం, బైతుల్లాను దర్శించి హజ్ చేయడం, రంజాన్ రోజాలుండటం. (ముత్తఫిక్ అలయ్).

ఈ ఐదు అంశాల్లో నమాజ్, మరియు రోజా కేవలం శారీరకంగా చేయాల్సినవి. జకాత్ దానధర్మాలు డబ్బు ఖర్చు పెట్టాల్సి వుంటుంది. హజ్ యాత్రలో శారీరకంగా మరియు ఆర్థికంగా పాల్గొనాల్సి వుంటుంది. శారీరక శ్రమ, ఆర్థిక ఖర్చు రెండూ చేయాల్సి వుంటుంది. హజ్ అంటే డిక్షనరీ ప్రకారం పవిత్రమైన స్థలాన్ని సందర్శించాలనే నిర్ణయం తీసుకోవడం. షరియత్ ప్రకారం హజ్ అంటే బైతుల్లాకు వెళ్ళాలనే నిర్ణయం తీసుకోవడాన్ని హజ్ అంటారు.

**హజ్ విధులు-నియమనిబంధనలు:** హజ్ నిబంధనలు రెండు రకాలుగా వున్నాయి. (1) హజ్ ఎవరి మీద తప్పనిసరి చేయడబడింది? (2) హజ్ చేయడానికి నియమనిబంధనలు, షరతులు ఏమిటి? హజ్ ప్రతి ముస్లింపై తప్పని సరి కాదు. హజ్ ఎవరిపై విధిగా చేయబడింది? ఎవరు వెళ్ళాలనే దానిపై కొన్ని నిబంధనలున్నాయి.

**1) ముస్లిం అయి వుండాలి:** హజ్‌తో పాటు ఇస్లాంకు చెందిన ఇతర ఆధ్యాత్మిక ఆచరణ (ఇబాదత్) అమలు చేయాలంటే ప్రధానంగా ఆ వ్యక్తి ముస్లిం అయి వుండాలి. ఇతర మతస్థులపై ఇస్లాంకు చెందిన విధివిధానలు, షరతులు (ఫర్జ్) తప్పని సరికాదు.

**2) బానిస కాకుండా ఉండాలి:** బానిస కాకుండా స్వేచ్ఛా జీవి అయి వుండాలి. బానిస హజ్ చేసినా అది నఫిల్ హజ్ అవుతుంది.

**3) యువకుడై వుండాలి:** హజ్ మూడవ షరతు యువకుడై వుండాలి. ఎవరైనా చిన్నపిల్లవాడు హజ్ చేస్తే అది నఫిల్ హజ్ కిందకే వస్తుంది. ఆ పిల్లవాడు యువకుడైన తరువాత మళ్ళీ హజ్ చేయడం తప్పనిసరి. చిన్నపిల్లవాడు తన తల్లిదండ్రులతో కలిసి హజ్ యాత్రకు వెళ్ళితే అతను కూడా హజ్‌కు సంబంధించిన అన్ని విధి విధానాలు, షరతులు పూర్తి చేయాల్సిందే. ఒక వేళ ఆ చిన్నారి హజ్ విధివిధానాలు పూర్తి చేసే స్థితిలో లేకపోతే అతని తల్లిదండ్రులే, ఆ పిల్లవాడ్ని ఎత్తుకొని హజ్ విధివిధానాలు పూర్తి చేయాల్సి వుంటుంది. అలా చేస్తేనే ఆ పిల్లవాడికి కూడా హజ్ పుణ్యం లభిస్తుంది.

**4) బుధిమంతుడై వుండాలి:** పిచ్చివాడు, లేక మానసిక వికలాంగులపై హజ్ తప్పని సరి కాదు. పిచ్చి వాళ్ళు, మానసిక వికలాంగులపై షరియత్ ఆదేశాలు వర్తించవు. ఒకవేళ ఎవరైనా పిచ్చికుదిరి మంచివాళ్ళుగా మరితే అప్పుడు వారిపై హజ్ తప్పనిసరి అవుతుంది.

**5) ఆర్థిక స్థోమత:** హజ్ యాత్ర చేసే వ్యక్తి ఆర్థిక స్థోమత కలిగి వుండాలి. ఒక వ్యక్తి ముస్లిం అయి వుండి, బానిసకాకుండా స్వేఛా కలవాడై వుండి, యువకుడై వుండి, బుధిమంతుడై వుండి, అతని వద్ద హజ్ యాత్ర చేయడానికి కావాల్సి దారిఖర్చులు లేకపోతే అలాంటి వ్యక్తికి హజ్ యాత్ర నుంచి మినహాయింపు వుంది. ఇలాంటి స్థితిలో వున్న వ్యక్తి గురించి ఖురాన్, హదీస్‌లో స్పష్టంగా వుంది. కేవలం టికెట్‌కు మాత్రమే డబ్బులుండి అక్కడ ఖర్చు పెట్టుకోవడానికి డబ్బు లేకపోతే వారికి కూడా హజ్ నుంచి మినహాయింపు వుంది.

సురే అల్ ఇమ్రాన్‌లో స్పష్టంగా వివరణ వుంది. బైతుల్లా వరకు వెళ్ళే స్థోమత వుంటే వారు తప్పని సరిగా హజ్ యాత్ర చేయాల్సిందే. ఇది ముస్లింలపై అల్లాకు వున్న హక్కు. అయితే డబ్బు పెట్టుకుని కూడా హజ్ యాత్ర చేయకపోతే, అసలు ప్రజలెవరూ బైతుల్లాను దర్శనం చేసుకోకపోయినా అల్లా యొక్క గొప్పతనం తగ్గదు. (ఆయత్ 97).

ఆయన సర్వసృష్టికర్త, సృష్టి పాలకుడు, సకల జీవరాసులు ఆయన ధ్యానంలో నిమగ్నమై వున్నాయి. మనిషి అల్లా ఆదేశాన్ని పాటించకపోతే అలాంటి వారు తీర్పుదినాన అల్లాహుతాలకు జవాబివ్వాల్సి వుంటుంది. ముస్లిం అయి వుండి హజ్ ఫరజ్ అదా చేయకపోతే యహూదీ, ఇసాయి, నస్రానీలా చనిపోతారు.

హజరత్ అలీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు. టిక్కెట్ డబ్బు, తినడానికి డబ్బు, హజ్ చేసే స్థోమత వుండి అలాంటి వ్యక్తి హజ్ చేయకుండా యహూదీలా, ఇసాయిలా చనిపోయినా అల్లాపై ఎలాంటి ప్రభావం వుండదు. అల్లాహ్‌తాలానే ఖురాన్‌లో ఇలా స్పష్టం చేశాడు. ఎవరైతే హజ్ చేయగలిగే ఆర్థిక స్థోమత కలిగి వుంటారో, వారు "అల్లా కోరకు బైతుల్లా దర్శనం చేయడానికి హజ్ ఫరజ్ చేయబడింది".(తిర్మిజి)

## హజ్ చేయడానికి విధానాలు-షరతులు

పైన చెప్పిన ఐదు షరతులు మీకు వర్తిస్తే హజ్ మీపై తప్పని సరి. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు హజ్ యాత్ర చేయాల్సిందే. హజ్ చేయడానికి కూడా కొన్ని షరతులు వున్నాయి. ఆ షరతులు ఎవరికైతే వర్తిస్తాయో వాళ్ళపై హజ్ విధిగా చేయబడింది. అంటే వాళ్ళే హజ్ యాత్ర చేయాల్సిందే. హజ్ చేయకుండా వుండి చివరి దశలో హజ్ యే బదల్, వేరే వారితో చేయించడం కుదరదు.

**1) ఆరోగ్యంగా వుండటం:** హజ్ చేయడానికి మొదటి షరతు ఆరోగ్యంగా, ఉత్సాహంగా వుండటం. ఒకవేళ అనారోగ్యంతో మంచం పట్టి వున్నట్లైతే, మక్కాయాత్ర చేసే స్థితి లేక పోతే, అలాంటి వారిపై హజ్ యాత్ర తప్పనిసరి కాదు. వారికి మినహాయింపు వుంది.

**2) ఆటంకాలు లేని దారి వుండాలి:** హజ్‌కు వెళ్లే దారిలో ఆటంకాలు, లేదా విపత్కర పరిస్థితులుంటే అలాంటి దారి ద్వారానే వెళ్ళే స్థితి ఉంటే అప్పుడు హజ్ చేయడం తప్పని సరి కాదు. ప్రస్తుతం విమానప్రయాణం సౌకర్యం వుంది. మనిషి వేల కిలోమీటర్ల దూరాన్ని గంటల్లో చేరుకుంటున్నాడు. ప్రస్తుతం ఇలాంటి షరతుకు ప్రధాన్యత లేదు.

**3) మహిళతో భర్త లేదా మహెరంతోడుగా వుండాలి:** పైన పేర్కొన్న షరతులతో పాటు మహిళలపై అదనంగా ఈ షరతు విధించబడింది. ఆమెతో పాటు భర్త లేదా మహెరం తోడుగా వుంటేనే హజ్ యాత్రకు వెళ్ళాలి. మహిళ భర్త లేదా మహెరం లేకుండా హజ్‌కు వెళ్ళడానికి షరియత్ ప్రకారం అనుమతి లేదు. హజరత్ ఇబ్నె అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు. "ఏ వ్యక్తి అయినా వంటరిగా వున్న మహిళాతో కూర్చొని మాట్లాడడం, కూర్చొవడం చేయరాదు. అలాగే మహెరం లేకుండా మహిళా ప్రయాణం చేయరాదు." అప్పుడు "ఒక వ్యక్తి ప్రవక్తతో ఇలా ప్రశ్నించాడు. ఫలానా ఫలానా యుద్ధంలో పాల్గొనాలని నా పేరు ప్రకటించారు. కానీ నా భార్య హజ్ యాత్రకు బయలుదేరుతోంది. నేను యుద్ధానికి, నా భార్య హజ్ యాత్రకు వెళ్ళొచ్చా! అప్పుడు ప్రవక్త ఇలా సమాధానం

చెప్పారు. యుద్ధానికి వెళ్ళడం ఉపసంహరించుకో. భార్యతో పాటు హజ్ యాత్ర చేయమని సూచించారు". (ముతఫిక్ అలై)

ఈ అంశానికి సంబంధించి ప్రస్తుత సమాజంలో ఎన్నో తప్పులు జరుగుతున్నాయి. ఉదాహరణకు (1) మహిళలు మహెరం లేకుండా హజ్‌యాత్రకు వెళ్తున్నారు. (2) ఒక మహిళతో ఆమె భర్త మహెరంగా వుంటాడు. వాళ్ళిద్దరూ హజ్‌కు వెళ్తుంటారు. వేరే మహిళ తనకు మహెరం లేకపోయినా ఇతర మహిళ యొక్క మహెరంను తన మహెరంగా చేసుకొని హజ్‌కు వెళ్తున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయి. ఇది చాలా తప్పు. (3) సంబంధంలేని పురుషుల్ని అన్న లాంటి వారే అంటున్నారు. నోటితో పిల్చినంత మాత్రాన అన్నతో సమానం కారు. అలాంటి వారితో హజ్ చేయరాదు. షరియత్ ప్రకారం మహెరంగా ఎవర్ని పడితే వారిని అనుకోవడం సరికాదు. మహెరం అంటే భర్తా లేదా ఎవరితో నిఖా సాధ్యం కాదో వారే మహెరం. అలాంటి వారితోనే మహిళ ప్రయాణం చేయాలి.

**4) మహిళ ఇద్దత్ సమయం:** మహిళలకు సంబంధించి మరో అదనపు షరతు కూడా అమలులో వుంది. అదేమంటే ఇద్దత్ కూడా హజ్ చేయడానికి అనుమతి ఇవ్వదు. మహిళా ఇద్దత్ సమయంలో హజ్ చేయరాదు. ఒక వేళ మహిళ మహెరం లేకుండా, ఇద్దత్ సమయంలో హజ్ చేస్తే హజ్ అయితే పూర్తి అవుతుంది కానీ, ఆ పాపం ఆమె తలపైనే వుంటుంది.

**ఆర్థికస్థోమత ఉండి కూడా హజ్ చేయకపోవడం**

మన సమాజంలో ఓ తప్పు రొటీన్‌గా కనబడుతోంది. అదేమంటే ఒక వ్యక్తిపై హజ్ తప్పనిసరి అయినా ఆ వ్యక్తి హజ్ విధులు నిర్వర్తించడంపై ఆసక్తి చూపడు. హజ్ చేయడానికి జాప్యం చేస్తూ వుంటాడు. అలా చేయడంపట్ల అల్లాహ్ తరఫున కఠినమైన ఆదేశం వుంది. హజరత్ ఇమాం షఫాయీ, ఇమాం ముహమ్మద్ తప్ప మిగతా ఇమాంలందరి అభిప్రాయం ప్రకారం స్థోమత వుండి హజ్ చేయకపోతే వారు పాపాత్ములౌతారు.


## SUBSCRIPTION COUPON

S.No:

I want to Subscribe to **AP Haj Bulletin** (Telugu, Urdu) Monthly, 1Year for Rs.85/-

DD/MO No.................................... ..............................................Date...................

Name & Address ...........................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

**Signature**

# హజ్ రెండవ రోజు

## అరఫాత్ వైపుకు ప్రయాణం

**తల్బియా : లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లకవల్ ముల్క్ లాషరీక లక**

**-ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ**

జిల్‌హజ్జహ్ మాసపు **9** వ తేదీన ఉదయం హజ్ యాత్రికులందరూ మినా నుంచి అరఫాత్ కు పయనిస్తారు. అరఫాత్ మినా నుంచి దాదాపు **16** కి.మీ. దూరంలో ఉంటుంది. ఒకవేళ మీరు ఎక్కువగా అలసిపోని పక్షంలో అరఫాత్‌కు సైతం కాలినడకనే వెళ్ళడం మంచిది. **4-5** గంటలు పడుతుంది. ఒకవేళ అంతగా నడిచే కారణంగా మీరు అలసిపోయి, ఆ అలసట కారణంగా అరఫాత్ లో సరియైన రీతిలో ప్రార్థించలేని అవకాశమున్న పక్షంలో మీరు మౌల్లిం ఏర్పాటు చేసే వాహనం ద్వారా అరఫాత్‌కు చేరుకోండి.

అరఫాత్ రోజు జుహ్రకు సంబంధించిన ప్రారంభ వేళలో నిమ్‌రహ్ అనే మస్జిద్ లో జుహ్ర మరియు అస్ర్ నమాజులు ఒకేమారు కలుపబడి చదవబడతాయి. అరఫాత్ రోజు కొరకు అస్ర్ నమాజును జుహ్ర నమాజ్‌తో కలిపి చదవవలసిందిగానే ఇస్లామీయ ధర్మశాస్త్రీయ ఆదేశమున్నది, తద్వారా సాయంత్రం వరకు దుఆ మొదలయినవాటి కొరకు పూర్తిగా తీరిక లభించేందుకు. మీరు ఆ జమాఅత్‌లో చేరే అవకాశముంటే రెండు నమాజులనూ జమాఅత్‌తో పాటే కలిసి చదువుకోండి. ఒకవేళ ఏదయినా కారణం చేత ఆ జమాఅత్‌లో మీరు చేరలేకపోయిన పక్షంలో మీరు జుహ్ర నమాజ్‌ను నిర్ణీత సమయంలో మరియు అస్ర్ నమాజ్‌ను నిర్ణీత సమయంలో చదువుకోండి.

అరఫాత్‌లో మిట్టమధ్యాహ్నం నుంచి సూర్యాస్తమయం వరకు గల సమయం ఎంతో విలువయినది. ఆ సమయంలో అల్లాహ్‌ను ఎంతగా హృదయపూర్వకంగా స్మరించగలిగితే అంతగా స్మరించండి, ఎంతగానయితే ఆయన ముందు రోదించగలరో రోదించండి, ఎంతగానయితే వేడుకోగలరో అంతగా వేడుకోండి ఈ విషయంలో ఎంతమాత్రం లోపభూయిష్టంగా వ్యవహరించకండి. అలాగే వీలయినంతవరకు నిలబడిన స్థితిలోనే ఆ విధంగా ప్రార్థించండి మరియు అల్లాహ్‌ను స్మరించండి.

అల్లాహ్‌ను స్మరించడానికి సంబంధించిన వచనాలలో

క్రింద పేర్కొనబడిన వచనాన్ని ప్రత్యేకంగా అక్కడ అత్యధికంగా పఠించండి :

" లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్‌కు వలహుల్ హమ్‌దు వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్ "

తర్జుమా : " అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయన కొరకే. ఆయన ప్రతి వస్తువుపై అధికారం గలవాడు"

దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "అరఫాత్ నాడు నా యొక్క మరియు నా కంటే పూర్వపు దైవప్రవక్తల యొక్క ప్రత్యేకమైన పిలుపు ఈ వచనమే "

ఏదిఏమయినప్పటికీ ఈ వచనం ద్వారా మరియు అల్లాహ్ స్మరణకు సంబంధించిన ఇతర సద్వచనాల ద్వారా అల్లాహ్‌ను అక్కడ ఎంతగానో స్మరించండి.

"ఖుల్‌హువల్లాహు అహద్ అల్లాహుస్ సమద్ లమ్‌యలిద్ వలం యూలద్ వలం యకుల్లహూ కుఫువన్ అహద్"

"అల్లాహుమ్మ సల్లిఅలా మహమ్మదిన్ వఅలాఆలి ముహమ్మదిన్ కమాసల్లైత అలా ఇబ్రాహీమ వ అలాఆలి ఇబ్రాహీమ ఇన్నక మహీదుమ్ మజీద్". ఏ దుఆయే కస్‌రత్ సే పఢే.

అలాగే హృదయపూర్వకంగా, ఎంతగానో రోదిస్తూ ఆయనను ప్రార్థించండి. అక్కడ ప్రత్యేక వచనాలు పఠించండి, ప్రార్థించండి, మన్నింపు కొరకు అల్లాహ్‌ను వేడుకోండి మరియు ఆయన సన్నిధిలో ఏడవండి. ఇవన్నీ తప్పనిసరి.

అందుకే ప్రార్థించే విషయంలో మరియు ఎంతగానో రోదిస్తూ అల్లాహ్‌ను వేడుకునే విషయంలో ఎంతమాత్రం లోపభూయిష్ఠంగా వ్యవహరించకండి. అన్నింటికంటే ఎక్కువగా మీ కొరకు, మీ తల్లిదండ్రుల కొరకు మన్నింపు మరియు పాప క్షమాపణ కొరకు వేడుకోండి. నరకం నుంచి మరియు అన్నిరకాల శిక్షల నుంచి విముక్తి కొరకు, స్వర్గం మరియు అల్లాహ్ ప్రసన్నత లభించేందుకై ప్రార్థించండి. అలాగే ఇహపర లోకాలలో ప్రతి అవసరం మరియు ప్రతి మేలు కొరకు అల్లాహ్‌ను ప్రార్థించండి. అలాగే మీ పై ఏదయినా హక్కును కలిగియున్నవారందరి కొరకు సైతం ప్రార్థించండి. అలాగే ముస్లిం సమాజమంతటి కొరకు ప్రార్థించండి.

అరఫాత్‌లో మీ గుడారంలో సైతం మీరు ఇదేవిధంగా అల్లాహ్ స్మరణలో, ప్రార్థించడంలో, మన్నింపు కొరకు దీనంగా వేడుకోవడంలో నిమగ్నులు కండి.

సాయంత్రవేళ లేదా మీ మార్గదర్శితో పాటు లేదా మరే వ్యక్తితోనయినా లేదా ఒంటరిగా 'జబలె రహ్‌మత్' (రహ్‌మత్ అనే కొండ) మీదికి వెళ్ళే అవకాశం లభించిన పక్షంలో అక్కడ సైతం అల్లాహ్ కారుణ్యం పట్ల పూర్తి నమ్మకంతో ప్రార్థించండి. అది దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) 'హజ్జతుల్ విదా' (ఆఖరి వీడ్కోలు హజ్) సందర్భంలో తమ ప్రసంగాన్ని వెలువరించిన, అల్లాహ్‌ను ఎంతగానో ప్రార్థించిన స్థలం.

అల్లాహ్ తరఫున వాటి స్వీకరణ విషయంలో దైవప్రవక్త(స) కు శుభవార్త లభించింది. అయితే ఆ కొండ మీదికి వెళ్ళడం తప్పనిసరి కాదు. అక్కడికి వెళ్ళిన కారణంగా తీవ్రమైన రద్దీ కారణంగా, కొన్ని సందర్భాలలో సహచరుల నుంచి తప్పిపోయే ప్రమాదమూ ఉంటుంది.

సూర్యాస్తమయం వరకు మీరు అరఫాత్‌లోనే ఉంటారు. సూర్యాస్తమయం తర్వాత మగ్‌రిబ్ నమాజ్ చదవకుండానే మీరు అక్కడినుంచి ముజ్‌దలిఫహ్‌కు వెళ్ళవలసి యుంటుంది.

తల్బియా, ఇస్తిఘఫర్, కల్మా తౌహీద్ మరియు అల్లాహ్ ప్రార్థన చేస్తున్నప్పుడు, ఖిబ్లా వైపుగా నిలబడి ఉండండి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అరఫాత్ మైదానంలో ఒంటెపై కూర్చుని జబలె రహ్మాత్ వద్ద ప్రసంగించారు. ప్రతి హజ్ యాత్రికుడు ప్రవక్త చేసిన ఖుత్బాను అర్ఫాత్ మైదానంలో స్మరించుకుని తమ జీవితంలో తప్పనిసరిగా అమలు చేయాలి.

# ప్రవక్త(స) అరాఫాత్‌లో చేసిన ప్రసంగం

అనంత కరుణామయుడూ, అపార కృపాశీలుడూ అయిన అల్లాహ్ పేరుతో...

అది అరబ్ చరిత్రలోనే అపూర్వ సమావేశం. 623వ సంవత్సరం. ప్రపంచం నలుమూల నుండి వచ్చిన దాదాపు లక్షన్నర స్త్రీపురుషుల సమూహం. హజ్‌యాత్రలో భాగంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటెపై కూర్చుని జబలె రహ్మత్ వద్ద ప్రసంగించారు.

అల్లాహ్‌ను ప్రశంసించి, కృతజ్ఞతలు తెలిపిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సంబోధించారు.

“ఓ ప్రజలారా! నేను చెప్పేదంతా శ్రద్ధగా వినండి. ఎందుకంటే నేను వచ్చే సంవత్సరం మీ మధ్యన జీవించి ఉంటానో లేదో నాకు తెలియదు. కాబట్టి, నేను మీకు చెబుతున్న దానిని చాలా జాగ్రత్తగా వినండి మరియు ఈ పదాలను (సందేశాన్ని) నేడు ఇక్కడ హాజరు కాలేక పోయిన వారికి కూడా చేర్చండి.

ఓ ప్రజలారా! మీరు ఈ నెలను, ఈ దినమును పవిత్రమైనదిగా పరిగణించినట్లే, ప్రతి ముస్లిం యొక్క జీవితాన్ని(ప్రాణాన్ని) మరియు సంపదను(ఆస్తిని) పవిత్రమైన విశ్వాస నిక్షేపంగా(నమ్మికగా) పరిగణించాలి. మీ వద్ద నమ్మకంతో ఉంచిన వస్తువుల్ని, వాటి అసలైన యజమానులకు తిరిగి వాపసు చేయాలి. మీరు ఎవ్వరికీ హాని కలిగించకూడదు, దాని వలన మీకెవ్వరూ హాని కలిగించరు.

‘నిశ్చయంగా మీరు మీ రబ్ (ప్రభువు)ను కలుసుకోబోతున్నారు మరియు ఆయన నిశ్చయంగా మీ కర్మల లెక్క తీసుకోబోతున్నాడు’ అనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి.

మీరు వడ్డీ తీసుకోవటాన్ని అల్లాహ్ నిషేధించాడు. కాబట్టి ఇక మీదట వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నియమ నిబంధనలన్నీ, హక్కులన్నీ రద్దు చేయబడినవి. మీ యొక్క అసలు మూలధనం మాత్రం మీరు తీసుకో వచ్చును. మీరు అసమానత్వాన్ని (హెచ్చు తగ్గులను, భేదాలను, వైషమ్యాలను) బలవంతంగా రుద్దకూడదు మరియు సహించ కూడదు. వడ్డీ నిషేధించబడినదని అల్లాహ్ తీర్పునిచ్చినాడు మరియు అబ్బాస్ ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్ కు చెల్లించ వలసి ఉన్న మొత్తం వడ్డీ ఇక మీదట రద్దు చేయబడినది.

షైతాన్ నుండి మీ ధర్మాన్ని కాపాడుకునేందుకు అప్రమత్తంగా (జాగ్రత్తగా) ఉండండి. అతడు పెద్ద పెద్ద విషయాలలో మిమ్మల్ని తప్పు దారి పట్టించే శక్తి తనకు ఏ మాత్రం లేదని తెలుసుకుని, తన ఆశలన్నీ వదులు కున్నాడు. కాబట్టి చిన్న చిన్న విషయాలలో కూడా అతడిని అనుసరించకుండా అప్రమత్తంగా ఉండండి.

ఓ ప్రజలారా! మీ స్త్రీలపై మీకు కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నమాట వాస్తవమే కాని వారికి కూడా మీ పై హక్కులు ఉన్నాయి. జ్ఞాపకం ఉంచుకోండి, కేవలం అల్లాహ్ పై ఉన్న విశ్వాసం ఆధారంగానే మరియు అల్లాహ్ యొక్క అనుమతి మూలంగానే మీరు వారిని తమ తమ భార్యలుగా చేసుకున్నారు.

మీ స్త్రీలతో మంచిగా ప్రవర్తించండి మరియు దయాదాక్షిణ్యాలతో వ్యవహరించండి ఎందుకంటే వారు మీ జీవిత భాగస్వాములు మరియు శ్రద్ధాభక్తులతో, సేవా నిరతితో సహాయ సహకారాలందించే అంకితమైన సహాయకులు.

ఒకవేళ వారు స్థిరంగా మీ హక్కులను పూర్తి

చేస్తున్నట్లయితే, మీ నుండి దయతో ఆహారం (అన్న పానీయాలు) మరియు దుస్తులు పొందే హక్కు వారి స్వంతమవుతుంది. ఇంకా మీరు అనుమతించని (ఇష్ట పడని) వారితో, వారు స్నేహంగా మెలగకూడదనేది మరియు తమశీలాన్ని అస్సలు కోల్పోకూడదనేది (వ్యభిచ రించకూడదు, తుంటరిగా ప్రవర్తించకూడదు) వారిపై మీకున్న హక్కు.

ఓ ప్రజలారా! అత్యావశ్యకంగా నా మాట వినండి. కేవలం అల్లాహ్‌నే ఆరాధించండి, ప్రతి దినపు ఐదు తప్పని సరి నమాజులను పూర్తిచేయండి,

రమదాన్ నెలలో తప్పనిసరిగా ఉపవాసం ఉండండి మరియు తప్పనిసరి అయిన విధి దానం(జకాత్) పేదలకు పంచి పెట్టండి.

ఒకవేళ మీకు తగిన శక్తిసామర్థ్యాలు ఉన్నట్లయితే, హజ్ పూర్తిచేయండి.

మొత్తం మానవజాతి ఆదం(అ) సంతతి యే, మరియు అరబ్ వాసులకు ఇతరులపై ఎటువంటి ఆధిక్యం లేదు, మరియు ఇతరులకు అరబ్ వాసులపై ఎటువంటి ఆధిక్యం లేదు. అలాగే నల్లవారి పై తెల్లవారికి ఎటువంటి ఆధిక్యం లేదు మరియు తెల్లవారిపై నల్లవారికి ఎటువంటి ఆధిక్యం లేదు, కేవలం దైవభక్తి మరియు మంచి నడవడికలో తప్ప.

ప్రతి ఒక్క ముస్లిం, ప్రతి ఒక్క ఇతర ముస్లింకు సోదరుడని మరియు ముస్లింలు సోదర భావాన్ని తప్పక స్థాపించాలని గ్రహించండి.

తోటి ముస్లింలకు చెందిన వాటిపై, మీకు ఎటువంటి అధికారం లేదు. కాని వారు ఇష్టపూర్వకంగా, మనస్ఫూర్తిగా, స్వతంత్రంగా మీకిస్తే తప్ప. కాబట్టి, ఈ విధంగా మీకు మీరే (ఇతరుల హక్కును గౌరవించకుండా) అన్యాయం చేసుకోవద్దు.

జ్ఞాపకం ఉంచుకోండి, ఒకరోజు మీరు అల్లాహ్ ముందు హాజరుకాబోతున్నారు. మీరు చేసిన ప్రతి పనికి, ప్రతి ఆచరణకు ఆ రోజున సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి, జాగ్రత్త! నేను ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోయిన తర్వాత మీరు సత్యమార్గానికి దూరం కావద్దు.

ఓ ప్రజలారా! నా తర్వాత వేరే ప్రవక్త లేక వేరే సందేశహరుడు రారు. మరియు ఏ క్రొత్త ధర్మమూ పుట్టదు. కాబట్టి వివేకంతో, జ్ఞానంతో, బుద్ధితో సరిగ్గా వ్యవహరించండి.

ఓ ప్రజలారా! ఇంకా, నేను మీకు తెలియజేస్తున్న ఈ పదాలను మంచిగా అర్థం చేసుకోండి. నేను నా వెనుక (నా తర్వాత) రెండు విషయాలను వదిలి వెళ్ళుతున్నాను,

ఒకటి దివ్యఖుర్ఆన్ మరియు రెండోది నా నిదర్శనం (దృష్టాంతం, ఉదాహరణ (సున్నత్) మరియు మీరు ఈ రెండింటినీ గనుక అనుసరిస్తే, ఎట్టి పరిస్థితిలోను నశించిపోరు.

నా వాక్కులు వింటున్నమీరందరూ, వీటిని ఇతరులకు చేర్చండి. ఇంకా ఆ ఇతరులు వేరే ఇతరులకు చేర్చాలి. అలా విన్నవారిలో చిట్టచివరి తరం వారు, ఇప్పుడు నా నుండి ప్రత్యక్షంగా వింటున్న మీకంటే ఇంకా మంచిగా అర్థం చేసుకోవటానికి కూడా ఆస్కారం ఉన్నది.

ఇలా ముహమ్మద్ ప్రవక్త(స) ప్రజలకు హితబోధ చేస్తూ పరస్పరం ఎలా మసలుకోవాలి, తోటి మానవులతో ఎలా వ్యవహరించాలి మొదలైన విషయాలు స్పష్టంగా తెలియచేశారు.

ముఖ్యంగా ఆయన జాతి, తెగ, వర్ణ వర్గ వివక్షలను నిర్మొహమాటంగా భేదభావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వాలను గురించి నొక్కి చెప్పారు.

చివర్లో ఆయన "ప్రజలారా! నేను దైవసందేశాన్ని మీకు అందజేశానా? అని ప్రశ్నించినప్పుడు - అందజేశారు మీరు" హాజీలంతా ముక్తకంఠంతో అన్నారు. ఇది విని ప్రవక్త(స) దీనికి నీవే సాక్షివి అని మూడుసార్లు అన్నారు. ఆ తరువాత ముజ్దల్ఫాకు ప్రయాణమైయ్యారు.

# ముజ్దలిఫహ్

సూర్యాస్తమయం వరకు మీరు అరఫాత్ లోనే ఉంటారు. సూర్యాస్తమయం తర్వాత మగ్‌రిబ్ నమాజ్ చదవకుండానే మీరు అక్కడినుంచి ముజ్దలిఫహ్‌కు వెళ్ళవలసి యుంటుంది. ముజ్దలిఫహ్ అరఫాత్ నుంచి దాదాపు 9 కి.మీ. దూరంలో ఉంటుంది. నడిచి వెళ్తే 3 గంటల సమయం పడుతోంది. ఎక్కువగా అలసిపోని పక్షంలో ముజ్దలిఫహ్‌కు కాలినడకన వెళ్ళడమే మంచిది. అక్కడికి వెళ్ళిన తర్వాత మగ్‌రిబ్ మరియు ఇషా నమాజులను ఇషా వేళలోనే చదవాలి. ఈ రోజు ఏవిధంగానయితే అరఫాత్‌లో జుహ్ర్ నమాజ్ వేళలో జుహ్ర్ మరియు అస్ర్ నమాజులను కలిపి చదవడం జరిగిందో అదేవిధంగా ముజ్దలిఫహ్‌కు చేరుకొని మగ్‌రిబ్ మరియు ఇషా నమాజులను కలిపి ఇషా వేళలో చదవాలి.

ఆ విధంగా చదవవలసిందిగానే ఇస్లామీయ ధర్మశాస్త్రీయ ఆదేశమున్నది. ఆవిధంగా చదవడమే దైవప్రవక్త (స) సున్నత్ (సంప్రదాయం). ఈ నమాజులను ఒంటరిగా లేదా జమాఅత్‌తో కలిసి చదవవచ్చు. ఇక్కడ రెండింటి విషయంలో ఇదే ఆదేశం వర్తిస్తుంది.

ఈ రాత్రి ముజ్దలిఫహ్‌లోనే గడపాలి. ఈ రాత్రివేళ సైతం వీలయినంతగా హృదయపూర్వకంగా అల్లాహ్‌ను స్మరించాలి మరియు ఆయనను ప్రార్థించాలి. ఇది ఎంతో శుభప్రదమైన రాత్రి. ఇందులో ఎన్నో శుభాలు అవతరిస్తాయి.

ఎందరో హజ్ యాత్రికులు అరఫాత్ నుంచి ఇక్కడకు వచ్చి పడిపోయి నిద్రించి మరుసటి రోజు మేల్కొంటారు. ఆ విధంగా వ్యవహరించడం ఎంతో నష్టదాయకమైనది. అరఫాత్ రాత్రివేళ సైతం అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించాలి మరియు ప్రార్థించాలి. హదీసులలో దైవప్రవక్త (స) అరఫహ్ నాడు అరఫాత్ మైదానంలో తమ అనుచర సమాజం కొరకు అల్లాహ్‌ను ఎన్నో రీతులలో వేడుకున్నారు. వాటిలో అన్నీ స్వీకరించబడ్డాయి గానీ ఒక ప్రార్థన మాత్రం స్వీకరించబడడానికి సంబంధించిన శుభవార్త దైవప్రవక్త (స) కు అక్కడ లభించలేదు. ఆయన (స) ముజ్దలిఫహ్‌కు చేరుకొని రాత్రివేళ తిరిగి తమ అనుచర సమాజం కొరకు అదేరీతిలో అల్లాహ్‌ను ప్రార్థించిన మీదట అల్లాహ్ అక్కడ దాని స్వీకరణకు సంబంధించిన శుభవార్తను అందజేశాడు.

పెద్ద షైతాను (జమ్రతుల్ అఖబా)పై రువ్వేందుయికకు ముజ్దలిఫాలో ఏడు కంకర్రాళ్ళు ఏరుకోవాలి. ఒక వేళ ఈ కంకర్రాళ్లను ముజ్దలిఫాకు బదులు మీనా నుంచే ఏరుకొని వచ్చినా పర్వాలేదు.

అయితే ఆ కంకర్రాళ్ళు శనగలంత పరిమాణంలో ఉంటే చాలు. పెద్ద పెద్ద గుండ్రాళ్ళు ఏరుకోనవసరం లేదు. అలా చేయటం సబబు కూడా కాదు.

ఈ రాత్రి హజ్ యాత్రికులు ముజ్దలిఫాలోనే గడపాలి. అత్యధికంగా జిక్ర్‌లు, దుఆలు చేయాలి. మష్అరుల్ హరామ్ అనబడే చోట నిలబడి అత్యధికంగా దుఆలు చేయటం మరింత పుణ్యప్రదం.

కనుక ఈ రాత్రి నిద్రలో, ఏమరుపాటులో గడపదగిన రాత్రి కాదనే విషయాన్ని మీరు గుర్తుంచుకోండి. మరీ ఎక్కువగా నిద్రమత్తు ఉన్న పక్షంలో కాసేపు నిద్రించండి. కానీ పెందలకడనే మేల్కొని అల్లాహ్ స్మరణలో, ఆరాధనలో, ఆయనను ప్రార్థించండి. అలాగే ఫజ్ర్ నమాజ్‌ను సైతం ప్రారంభవేళలో చదవండి.

ఆ తర్వాత ఎంతో సేపటివరకు అల్లాహ్ స్మరణలో మరియు దుఆ చేయడంలో గడపండి. బాగా తెల్లవారే వరకూ అల్లాహ్ స్మరణలో, ధ్యానంలో నిమగ్నులై ఉండాలి. సూర్యోదయం వేళ ఆసన్నమయినప్పుడు అక్కడి నుంచి మినా వైపుకు పయనాన్ని ఆరంభించండి.

# ఉమ్‌రహ్ ఎలా చేయాలి?

## మస్జిదె హరామ్‌లోకి ప్రవేశం

కాబా గృహానికి నలువైపులా నిర్మించబడిన వైభవోపేతమైన కట్టడాన్ని 'మస్జిదె హరామ్' అంటారు. ఇందులో వందకు మించిన సంఖ్యలో ద్వారాలున్నాయి. దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) యొక్క గృహం మర్వహ్ కొరకు ఉత్తర తూర్పు దిశగా ఉండేది. దైవప్రవక్త(స) తరచుగా సఫా మరియు మర్వహ్ కొండల నడుమ ఉన్న 'బాబుస్సలామ్'గా పిలువబడే ద్వారం గుండానే మస్జిదె హరామ్‌లోకి ప్రవేశించేవారు. కనుక మీరు కూడా ఒక వేళ సాధ్యపడినట్లయితే బాబుస్సలామ్ గుండా మస్జిదె హరామ్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించండి. లేకుండా ఏ ద్వారం గుండానయినా మీరు మస్జిదె హరామ్‌లోకి ప్రవేశించవచ్చు. మీరు మస్జిదె హరామ్‌లోకి ప్రవేశించే సమయంలో క్రింది దుఆను పఠించండి.

**"బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్"**

తర్జుమా: అల్లాహ్ పేరుతో ప్రవేశిస్తున్నాను. అలాగే దైవ ప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స)పై దరూద్ మరియు సలామ్ పంపుతున్నాను''. ఆ తర్వాత మీ కుడికాలిని మస్జిదె హరామ్‌లోకి ప్రవేశపెడుతూ క్రింది దుఆను పఠించండి.

**"రబ్బిగ్ఫిర్‌లీ వఫ్‌తహ్‌లీ అబ్‌వాబ రహ్‌మతిక్"**

తర్జుమా: "ఓ నా ప్రభువా! నా పాపాలను క్షమించు. అలాగే నా కొరకు నీ అనుగ్రహపు ద్వారాలను తెరువు''.

కాబా గృహంపై మొట్టమొదటి దృష్టి నిలిచినప్పుడు పఠించవలసిన దుఆ. కాబా గృహంపై మొట్టమొదటి సారిగా మీ దృష్టి నిలిచినప్పుడు రెప్పవేయడానికి ముందు మీరు దేని కొరకు ప్రార్థించినా అల్లాహ్ దానిని స్వీకరిస్తాడు. కనుక ఆ క్షణం ఎంతో విలువయినది. అతి ముఖ్యమైనది. ఆ క్షణం ద్వారా వీలయినంత ఎక్కువగా ప్రయోజనం పొందేందుకై ముందు నుంచే సిద్ధంగా ఉండండి. మస్జిదె హరామ్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో మీ కళ్ళను క్రిందికి వాల్చండి. ఆ తర్వాత దాదాపు రెండు వందల అడుగులు ముందుకు వెళ్లండి. ఆ క్రమంలో మీరు రెండు పర్యాయాలు మెట్లు దిగవలసి వస్తుంది. మీరు మస్జిదె హరామ్ ఆవరణలోకి ప్రవేశించినప్పుడు దారికి ఒక వైపున జరిగి నిల్చోండి. అప్పుడు మీరు తల పైకెత్తి దేని వైపుకు అభిముఖులయి మీరు జీవిత పర్యంతం నమాజ్ చదువుతూ ఉండేవారో ఆ అల్లాహ్ గృహాన్ని, అనగా కాబా గృహాన్ని చూడండి. కాబాగృహంపై మీ దృష్టిని నిలిపి ఉంచండి. రెప్పవాల్చకుండా క్రింది దుఆను పఠించండి.

**"ఓ అల్లాహ్! దీని తర్వాత నేను మంచికి సంబంధించి ఏమి ప్రార్థించినా దానిని స్వీకరించు"**. ఆ తర్వాత మూడు సార్లు క్రింది దుఆను పఠించండి. **"అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్"**.

తర్జుమా: "అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు''.

ఈ దుఆ కాకుండా మీరు తక్బీర్‌ను సైతం పఠించవచ్చు. **"అల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్. లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లా హిల్ హమ్ద్"**.

తర్జుమా: "అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. మరియు అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు మరియు సమస్త స్తోత్రాలు అల్లాహ్ కొరకే!''

ఆ తరువాత దరూదె షరీఫ్ పఠించండి. ఆ తర్వాత మీరు హృదయ పూర్వకంగా అల్లాహ్‌ను మీరు కోరుకునే వాటి కొరకు ప్రార్థించండి. అది అనంత ఐశ్వర్యాలను కలిగియున్న సర్వ సృష్టికర్తకు చెందిన దర్బారు. అడిగే దాసుడు

అడుగుతూ అడుగుతూ అలసిపోతాడే గానీ ప్రసాదించే సృష్టికర్త మాత్రం ఇస్తూ ఇస్తూ ఎంతమాత్రం అలసిపోడు. మీ కొరకు, మీ తల్లిదండ్రుల కొరకు, మీ భార్యా బిడ్డల కొరకు, మీ బంధు మిత్రుల కొరకు ముస్లిం సమాజం కొరకు మీ దేశం కొరకు, ప్రతి ఒక్కరి కొరకు ప్రశాంతంగా రోదిస్తూ అల్లాహ్‌ను వేడుకోండి.

ఉమ్‌రాహ్‌కు సంబంధించిన రెండు ఫరజ్ ఆచరణల్లో ఒక దానిని మీరు ఇహ్‌రామ్ కట్టుకోవడం ద్వారా పూర్తి చేశాడు. ఇక ఇప్పుడు మీరు రెండవ ఫరజ్ ఆచరణ అయిన తవ్వాఫ్‌ను పూర్తి చేయవలసి ఉంది. తవ్వాఫ్ హజ్‌రె అస్వద్ నుంచి మొదలయి హజ్‌రె అస్వద్ వద్దే ముగుస్తుంది.

'హజ్‌రె అస్వద్' అనేది కాబా గృహానికి తూర్పు మూలన ఉంచబడిన స్వర్గానికి చెందిన ఒక రాయి. దానిని నలువైపులా వెండి ఫ్రేము బిగించబడి ఉంది.

తవ్వాఫ్‌ను హజ్‌రె అస్వద్ తాకి, చుంబించి ప్రారంభించడం జరుగుతుంది. అయితే విపరీతమైన రద్దీ కారణంగా ఆ విధంగా చేయడం సాధ్యం కాదు. అందుకే సాధ్యపడే రీతిలో సులభమైన రీతిలో చేయదగిన ఉమ్‌రహ్ విధానం గురించి క్రింద పేర్కొనబడుతోంది.

తవ్వాఫ్‌ను హజ్‌రె అస్వద్ సమీపం నుంచి లేదా దూరం నుంచి చుంభించడం ద్వారా ప్రారంభించడం జరుగుతుంది. అయితే హజ్‌రెఅస్వద్ ముందరి ప్రదేశాన్ని అంచనా వేసేందుకై తూర్పు దిశగా ముతాఫ్‌లో గోడ మీద మరియు చుట్టూ ఉన్న మస్జిదె హరామ్ పై కప్పు మీద మరియు టెర్రస్ మీద ఉన్న స్తంభాలపై ఆకుపచ్చని ట్యూబ్‌లైట్లు అమర్చబడి ఉన్నాయి. వాటి ద్వారా మీరు హజ్‌రె అస్వద్ ముందరి ప్రదేశాన్ని అంచనా వేయగలుగుతారు. మీ తవ్వాఫ్ ఆ గుర్తు వద్ద నుంచే మొదలయి ఆ గుర్తు వద్దే ముగుస్తుంది.

కాబా గృహంపై మీ మొట్టమొదటి దృషి నిలిచినప్పుడు దుఆ పఠించిన తర్వాత మీరు హజ్‌రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్‌కు ముందరి భాగానికి వచ్చేయండి. అక్కడకు చేరుకునేందుకై మీరు ప్రజలకు వ్యతిరేక దిశలో నడవడానికి బదులు తవ్వాఫ్ చేస్తున్న వారిలో చేరిపోండి. వారితో పాటు కలిసి నడుస్తూ హజ్‌రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్ మధ్య భాగానికి చేరుకోండి.

## రమల్

ఒక తవ్వాఫ్‌ను పూర్తి చేసేందుకై కాబాగృహం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేయవలసి ఉంటుంది. అలాగే తవ్వాఫ్ ముగిసిన తర్వాత రెండు రకాతులు 'వాజిబుత్తవ్వాఫ్' నమాజ్ చదవ వలసి ఉంటుంది.

ఉమ్‌రహ్‌కు చెందిన తవ్వాఫ్‌లో మరియు హజ్‌కు చెందిన తవ్వాఫ్ జియారత్‌లోనూ మొదటి మూడు ప్రదక్షిణలు చేసే సమయంలో పురుషులు యోధుల వలె, పహిల్వాన్‌ల వలె ఛాతీని ముందుకు తెచ్చి చిన్న చిన్న అడుగులు వేస్తూ వేగంగా నడవవలసి ఉంటుంది. ఆ విధంగా నడవడాన్ని 'రమల్' అంటారు. రమల్ చేసే సమయంలో కుడిచేతి భుజాన్ని బహిర్గతం కావించి (వస్త్రంతో కప్పకుండా) ఉంచడం జరుగుతుంది. ఆ విధంగా చేయడాన్ని 'ఇజ్‌తిబాఆ' అంటారు. ఇజ్‌తిబాఆ కొరకు ఇహ్‌రామ్ వస్త్రానికి చెందిన ఒక భాగాన్ని కుడి చేతి చంక కింది నుంచి పోనిచ్చి ఎడమచేతి భుజం మీద వేసుకోవడం జరుగుతుంది.

నఫిల్ తవ్వాఫ్ చేసే సందర్భంలో రమల్ చేయడమూ జరగదు, ఇజ్‌తిబాఆ చేయడమూ జరగదు.

## తవ్వాఫ్‌కు చెందిన మొదటి ప్రదక్షిణ

ప్రజలతో రద్దీగా ఉన్న సమయంలో మీరు తవ్వాఫ్ చేస్తూ చేస్తూ హజ్‌రె అస్వద్ వద్దకు చేరుకున్నప్పుడు హజ్‌రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్‌కు మధ్యభాగానికి అర అడుగు ముందే నిలిచిపోండి. అప్పుడు హజ్‌రె అస్వద్ వైపుకు అభిముఖులయి తవ్వాఫ్ కొరకు ఈ క్రింది విధంగా నియ్యత్ చేసుకోండి.

**"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదు తవాఫ్ బైతికల్ హరామి సబ్అత అష్వతిల్లాహి తాలా ఫయస్సర్హూ లీ వ తఖబ్బల్హూ మిన్నీ".**

తర్జుమా: "ఓ అల్లాహ్! నేను నీకు చెందిన ఈ గౌరవనీయమైన గృహం చుట్టూ నీ ప్రీతిని, అనుగ్రహాన్ని పొందే ఉద్దేశ్యంతో తవ్వాఫ్ చేస్తున్నాను. నీవు దీనిని నా కొరకు సులభతరం కావించు మరియు స్వీకరించు".

నియ్యత్ చేసిన తర్వాత మీరు హజ్రె అస్వద్ మరియు ఆకు పచ్చని ట్యూబ్ లైట్కు సరిగ్గా మధ్య భాగానికి చేరుకునేటట్లు కుడివైపుకు జరగండి. ఆ తర్వాత క్రింద పేర్కొనబడిన తక్బీర్ను పఠిస్తూ నమాజ్ను ప్రారంభిస్తున్న సమయంలో చెవుల వరకు చేతులను ఏ విధంగానయితే ఎత్తుతారో అదే విధంగా ఎత్తండి.

**"బిస్మిల్లాహి అల్లాహు అక్బర్. వలిల్లా హిల్ హమ్ద్"**

తర్జుమా: అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు మరియు సకల స్తోత్రాలు అల్లాహ్ కొరకే".

పైన పేర్కొనబడిన తక్బీర్ను పలికిన తర్వాత చేతులను వదిలివేయాలి. ఆ తర్వాత ఒక వేళ హజ్రె అస్వద్ మీరు తాకగలిగినంత సమీపంలో ఉన్నట్లయితే హజ్రె అస్వద్ దిశగా రెండు అరచేతులను హజ్రె అస్వద్ను తాకేందుకై మీరు ప్రయత్నిస్తున్నట్లుగా సూచిస్తూ భుజాల వరకు పైకెత్తాలి. ఆ తర్వాత అరిచేతులను చుంబించండి. (ముద్దు పెట్టుకోండి). ఆ విధంగా చేయడమనేది హజ్రె అస్వద్ను చుంబంచడానికి సమానం. ఈ విధంగా చేయడాన్ని 'ఇస్తిలామ్' అంటారు. ఇస్తిలామ్ చేసిన తర్వాత మీరు తవ్వాఫ్ చేసే దిశ వైపుకు మరలి తవ్వాఫ్ను ప్రారంభించండి.

కాబా గృహం నాలుగు మూలలను కలిగి యున్నది. తవ్వాఫ్ చేస్తున్నప్పుడు హజ్రె అస్వద్ అమర్చబడియున్న కాబా గృహానికి చెందిన మొదటి మూల నుంచి మూడవ మూలకు చేరుకునేంత వరకు మీరు మూడవ కలిమ్ను పఠించండి.

**"సుబ్హానల్లాహి వల్హమ్దులిల్లాహి వలాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. వలా హౌలా వలా ఖువ్వత్ ఇల్లా బిల్లా హిల్ అలియ్యిల్ అజీమ్"**

తర్జుమా: "అల్లాహ్ పరమ పవిత్రుడు. సకల స్తోత్రాలూ అల్లాహ్ కొరకే! అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. పాపాల నుంచి రక్షించుకునే శక్తి, సత్కార్యం వైపు మరలే శక్తి అల్లాహ్ తరపు నుంచి మాత్రమే ప్రాప్తమవుతుంది.

కాబాగృహానికి చెందిన మూడవ మూలను 'రుక్నె యమానీ' అని పిలుస్తారు. రుక్నె యమానీ నుంచి తిరిగి హజ్రె అస్వద్ వరకు చేరుకునేంత వరకు క్రింది దుఆను పఠించాలి.

**"రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనత్ వ్వఫిల్ ఆఖిరతి హసనత వ్వఖినా ఆజాబన్నార్".**(ఖుర్ఆన్, అల్బఖరహ్)

తర్జుమా: "ఓ మా ప్రభువా! మాకు ప్రపంచంలోనూ శ్రేయస్సును ప్రసాదించు. అలాగే పరలోకంలోనూ శ్రేయస్సును ప్రసాదించు. అలాగే మమ్మల్ని నరకాగ్ని నుంచి రక్షించు".

రుకెన్ యమానీ మరియు హజ్రె అస్వద్కు నడుమ 70 వేల దైవదూతలు తవ్వాఫ్ చేస్తున్న వారి ప్రార్థనలకు ఆమీన్ పలుకుతారు. అందుకే పైన పేర్కొనబడిన దుఆను (అది ఖుర్ఆన్లోని ఒక ఆయత్ కూడా అయినందున) పఠించడం ఎంతో ఉత్తమం.

పైన తవ్వాఫ్కు సంబంధించి పేర్కొనబడిన రెండు దుఆలు తవ్వాఫ్కు సంబంధించిన దుఆలలో ఎంతో సులువైనవి. మీకు హజ్ అంశంపై వ్రాయబడిన పుస్తకాలలో ప్రతి తవ్వాఫ్ కొరకు విడివిడిగా పెద్ద పెద్ద దుఆలు కనిపిస్తాయి. మీరు వాటిని కూడా చదవవచ్చు. అయితే మీరు ఏది పఠించినా బాగా అర్థం చేసుకొని, పుస్తకంలోకి చూడకుండా

పఠించండి. అర్థం చేసుకొని హృదయపూర్వకంగా చేయబడే దుఆ మాత్రమే ప్రభావం చూపుతుంది. తవ్వాఫ్ చేస్తూ పుస్తకాన్ని దుఆ పఠించడం వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగుతుంది.

తవ్వాఫ్ చేస్తున్న సమయంలో కాబాగృహం వైపుకు ముఖభాగాన్ని ఉంచడం మక్రూహ్ (అవాంఛనీయ చర్య). అయితే వీపును కాబా గృహం వైపు ఉంచడమయితే మక్రూహ్ తహ్రీమీ (హరామ్ స్థాయికి దగ్గరగా ఉన్న అవాంఛనీయ చర్య). కనుక తవ్వాఫ్ చేస్తున్న సమయంలో చూపులను నడుస్తున్న ప్రదేశం వైపు ఉంచి నేరుగా సాగిపోవాలి.

## తవ్వాఫ్‌కు చెందిన రెండవ ప్రదక్షిణ

రుకెన్ యమానీ నుంచి దుఆ పఠిస్తూ మీరు హజ్రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్‌కు మధ్య భాగంలో నల్లని పట్టీ మీదికి చేరుకున్నప్పుడు హజ్రె అస్వద్ వైపుకు వక్షభాగాన్ని తిప్పకుండా కేవలం ముఖభాగాన్ని తిప్పాలి. అలాగే అరి చేతులను హజ్రె అస్వద్ వైపుకు తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. (ముద్దు పెట్టుకోవాలి).

**"బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ వలిల్లా హిల్ హమ్ద్"**

తర్జుమా: అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు మరియు సకల స్తోత్రాలూ అల్లాహ్ కొరకే''.

హజ్రె అస్వద్ వైపుకు వక్షభాగాన్ని ఉంచి పూర్తిగా అభిముఖులయి కేవలం మొదటి తవ్వాఫ్‌ను ప్రారంభిస్తున్నప్పుడు మాత్రమే నియ్యత్ చేసుకోవడం, తక్బీర్ పఠించడం, ఇస్తిలామ్ చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ప్రతి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న సమయంలో కేవలం ముఖభాగాన్ని మాత్రమే హజ్రె అస్వద్ వైపుకు తిప్పి ఉంచి అరచేతులను హజ్రె అస్వద్ వైపుకు తిప్పి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. ఆ సమయంలో మీ వక్షభాగం తవ్వాఫ్ చేయబడే దిశలోనే ఉంచాలి.

ఇస్తిలామ్ చేసిన తర్వాత ముందు చేసినట్లుగానే రుక్నె యమానీ వరకు మూడవ కలిమహ్‌ను పఠించండి. ఆ తర్వాత రుక్నె యమానీ నుంచి తిరిగి హజ్రె అస్వద్‌కు చేరుకునేంత వరకు ఇంతకు ముందు పేర్కొనబడిన దుఆను పఠించాలి. ఆ విధంగా ఏడు ప్రదక్షిణలను పూర్తి చేసినప్పుడు ఒక తవ్వాఫ్ పూర్తవుతుంది.

మీ చేతిలో ఏడు గుళికల మాలను ఉంచుకోండి. ప్రతి ప్రదక్షిణ ముగిసిన తర్వాత ఒక గుళికను తగ్గిస్తూ ప్రదక్షిణలను లెక్కించండి. ఏడవ ప్రదక్షిణ ముగిసినప్పుడు హజ్రె అస్వద్ వైపుకు ముఖభాగాన్ని, అరిచేతులను తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. అనగా ఇస్తిలామ్ చేయాలి. (అది మీ యొక్క ఎనిమిదవ ఇస్తిలామ్) అప్పటి వరకు బహిర్గతమయి ఉన్న మీ యొక్క కుడి భుజాన్ని వస్త్రంతో కప్పి వేసి ముఖామె ఇబ్రాహీమ్ వెనుక భాగానికి వచ్చేయండిం. ఆ వైపున కాబాగృహానికి చెందిన తలుపు కూడా ఉంది. అప్పుడు తవ్వాఫ్ చేసే వారి కొరకు స్థలం విడిచి రెండు రకాతుల నమాజ్‌ను 'వాజిబుత్తవాఫ్' చదువుతున్నట్లుగా నియ్యత్ చేసుకొని చదవండి. ఆ విధంగా చేయడం వల్ల మీ తవ్వాఫ్ ఆచరణ పూర్తవుతుంది. అలాగే ఉమ్రహ్‌కు చెందిన రెండవ ఫరజ్ ఆచరణ కూడా పూర్తవుతుంది. ఆ విధంగా మీ ఉమ్రహ్ నెరవేరుతుంది.

## జమ్ జమ్ నీటిని త్రాగడం

రెండు రకాతుల వాజిబుత్తవాఫ్ నమాజ్ చదివిన తర్వాత మీరు కడుపు నిండా జమ్ జమ్ నీటిని త్రాగండి. జమ్ జమ్ నీటిని ఖిబ్లాహ్ వైపుకు అభిముఖులై నిలబడి **'బిస్మిల్లాహ్'** అని పలికి త్రాగాలి. నీటిని త్రాగిన తర్వాత క్రింద పేర్కొనబడిన దుఆను పఠించండి.

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఇల్మన్ నాఫిఅ వ్వ రిజ్ఖ వ్వాసిఅ వ్వషిఫా అమ్ మిన్ కుల్లి దాఅ"**

తర్జుమా: "ఓ అల్లాహ్! నాకు ప్రయోజనదాయకమైన జ్ఞానాన్ని ప్రసాదించు. భుక్తిలో విస్తృతిని ప్రసాదించు. అలాగే ప్రతి వ్యాధి నుంచీ ఆరోగ్యాన్ని ప్రసాదించు''

హజ్రత్ జాబిర్(ర) ఈవిధంగా ఉల్లేఖించారు" జమ్ జమ్ అనేది దేని కొరకు ఉద్దేశించి తాగబడుతుందో దాని కొరకు ఉద్దేశించబడినది" (ఇబ్నెమాజహ్) అనగా జమ్ జమ్ నీటిని త్రాగే వ్యక్తి ఏ సంకల్పంతో త్రాగినా అల్లాహ్ అతడి సంకల్పాన్ని నెరవేరుస్తాడు.

జమ్ జమ్ నీటిని త్రాగిన తర్వాత తిరిగి హజ్రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్ మధ్య భాగానికి చేరుకోవాలి. తిరిగి ఒక పర్యాయం హజ్రె అస్వద్ వైపుకు అరిచేతులను తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. అనగా ఇస్తిలామ్ చేయాలి. అది మీ యొక్క తొమ్మిదవ ఇస్తిలామ్ తర్వాత మీరు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్ వైపుకు కాబా గృహానికి దూరంగా నడుస్తూ పోవాలి. ఆ విధంగా మీరు సఫా ప్రదేశానికి చేరుకుంటారు.

## సఫా, మర్వాహ్‌ల మధ్య సఈ చేయడం

సఫా మరియు మర్వాహ్‌లు తొలుత చిన్న కొండలుగా ఉండేవి. ఇప్పుడు కేవలం రెండు ఎత్తయిన ప్రదేశాలుగా మాత్రమే ఉన్నాయి. సౌదీ ప్రభుత్వం సఫా మరియు మర్వాహ్‌లను సఈ చేయబడే ప్రదేశాలన్నింటినీ మస్జిదె హరామ్ కట్టడంలోనే ఇమిడ్చి నవీన నిర్మాణాన్ని పూర్తి చేసింది.

సఫా మర్వాహ్‌ల మధ్య బజారు ఉండేది. హజ్ యాత్రికులు ఎండలో బజారులోని రద్దీలో సఈ చేసే వారు. ఇప్పుడు మస్జిదె హరామ్ సమస్త కట్టడమూ ఏయిర్ కండిషన్డ్ చేయబడి ఉంది. నేల మీద పాలరాళ్ళు పరచబడి ఉన్నాయి.

సఫా వద్దకు చేరుకొని కాబా గృహం వైపుకు అభిముఖులై సఈ కొరకు క్రింది నియ్యత్ చేసుకోవాలి

**"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుస్సఅయ బైన స్సఫా వల్ మర్వత సుబ్అత అష్ వాతిన్ లి వజ్హికల్ కరీమ్. ఫయస్సర్‌హూ లీ వ తఖబ్బల్‌హుమిన్నీ"**

తర్జుమా: "ఓ అల్లాహ్! కేవలం నీ ప్రీతిని పొందే ఉద్దేశ్యంతో నేను సఫా మరియు మర్వాహ్‌ల నడుమ ఏడు చక్కర్లతో సఈ చేయాలనుకుంటున్నాను. నా కొరకు సఈ చేయడాన్ని సులభతరం కావించు మరియు స్వీకరించు"

నియ్యత్ చేస్తున్న సమయంలో చేతులను దుఆ చేస్తున్న సమయంలో ఎత్తే రీతిలో పైకెత్తాలి. నమాజ్ కొరకు తక్బీర్ పలుకుతున్న సమయంలో ఎత్తే రీతిలో పైకెత్తకూడదు.

**పవిత్ర మక్కా నగరంలోని 15 ప్రదేశాలలో దుఆ తప్పకుండా స్వీకరించబడుతుంది. అవి క్రింద పేర్కొనబడుతున్నాయి.**

1) ముతాఫ్ (తవ్వాఫ్ చేయబడే ప్రదేశం)

2) ముల్‌తజిమ్ (కాబా గృహం)

3) మీజాబె రహ్మత్ క్రింది భాగం (కాబా గృహం పైకప్పు యొక్క తూము)

4) హతీమ్, 5) కాబా గృహం లోపల

6) జమ్ జమ్ బావి సమీపంలో

7) మఖామె ఇబ్రాహీమ్ వెనుక భాగం

8) సఫా, 9) మర్వాహ్

10) సఫా మరియు మర్వాహ్‌ల మధ్య సఈ చేయబడే ప్రదేశం ముఖ్యంగా రెండు ఆకుపచ్చని స్తంభాల మధ్యభాగం.

11) అరఫాత్

12) ముజ్‌దలిఫహ్

13) మినాలో చిన్న షైతాన్ మరియు మధ్యస్థ స్థాయి షైతాన్ సమీపంలో. 14) హజ్రె అస్వద్ మరియు రుక్నె యమానీల మధ్య భాగం

15) హజ్రె అస్వద్‌కు సమీపంలో సఫా, మర్వహ్ మరియు సఈ చేయబడే ప్రదేశాలు తప్పకుండా దుఆ స్వీకరించబడే ప్రదేశాలు. కనుక సఈ చేసే సమయంలో మరియు సఈ పూర్తి చేసిన తర్వాత మీరు సఫా మరియు మర్వహ్‌ల మధ్య నిలిచియున్న సమయంలో అల్లాహ్‌ను బాగా ప్రార్థించండి. మీ పాపాల క్షమాపణ కొరకు వేడుకోండి.

సఫా మరియు మర్వహ్‌ల నడుమ మీరు ఎప్పుడయితే నిలిచి ఉండడం జరుగుతుందో అప్పుడు మూడు సార్లు నాల్గవ కలిమహ్‌ను, ఒక పర్యాయం మూడవ కలిమహ్‌ను పఠించండి. సఈ చేస్తున్న సమయంలో ఎక్కువగా నాల్గవ కలిమహ్‌ను పఠించండి. ఇది సులభమైన ఆరాధనా విధానం. సఫా మరియు మర్వహ్‌ల నడుమ ఏడు సఈల కొరకు వేర్వేరు దుఆలు పేర్కొనబడ్డాయి. వాటిని మీరు హజ్ అంశంపై వ్రాయబడిన పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా తెలుసుకొని పఠించవచ్చు.

దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) సతీమణి అయిన హజ్రత్ హాజిరహ్(అ) ఆనాడు సఫా మరియు మర్వహ్ కొండల మధ్య ఉన్న కనుమలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పరుగెత్తేవారు. ఎందుకంటే కాబాగృహం సమీపంలో ఉన్న ఆవిడ కుమారులయిన హజ్రత్ ఇస్మాయీల్(అ) ఆవిడకు కనిపించకుండా కనుమరుగయ్యేవారు. ఆవిడ యొక్క సున్నత్ ఈనాటికీ ఆచరించబడుతోంది. సౌదీ ప్రభుత్వం రెండు ఆకుపచ్చని రంగులో ఉన్న స్తంభాలను, ట్యూబ్‌లైట్లను గుర్తుగా అమర్చింది. వాటిని 'మైలైన్ అఖ్జరైన్' అంటారు. వాటి మధ్య పురుషులు కొద్దిగా పరుగెత్తూతూ నడవవలసి ఉంటుంది. మహిళలు తమ సాధారణ వేగంతోనే నడవవలసి ఉంటుంది.

సఫా నుంచి మొదలుపెట్టి మర్వహ్ వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే సఈకు సంబంధించిన ఒక చక్కర్ పూర్తయినట్లవుతుంది. తిరిగి మర్వహ్ నుంచి మొదలు పెట్టి సఫా వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే అది రెండవ సఈకు సంబంధించిన రెండవ చక్కర్ అవుతుంది. ఆ విధంగా మీరు సఈకు సంబంధించిన ఏడు చక్కర్లను పూర్తి చేస్తారు. మీ సఈకు, సఫా నుంచి మొదలు పెట్టి మర్వహ్ వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే సఈకు సంబంధించిన ఒక చక్కర్ పూర్తయినట్లవుతుంది. తిరిగి మర్వహ్ నుంచి మొదలు పెట్టి సఫా వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే అది రెండవ సఈకు సంబంధించిన రెండవ చక్కర్ పూర్తి అవుతుంది. ఆ విధంగా మీరు సఈకు సంబంధించిన ఏడు చక్కర్లను పూర్తి చేస్తారు. ఈ సఈకు సంబంధించిన ఏడవ చక్కర్ మర్వహ్ వద్ద ముగుస్తుంది. సఈ చేసేందుకు ఉద్దేశించబడిన ప్రదేశం ఎంతో పరిమితమైనది. అందుకే హజ్‌కు సంబంధించిన ప్రత్యేక దినాలలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. తవ్వాఫ్ కంటే ఎక్కువ సమయం సఈ చేసేందుకు పడుతుంది. కనుక అటువంటి పరిస్థితిలో మస్జిదె హరామ్‌కు చెందిన మొదటి అంతస్తులో లేదా పైకప్పు మీద సఈ చేయడం సులభతరమవుతుంది.

సఈ పూర్తి చేసిన తర్వాత రెండు రకాతులు అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో చదవడం ముస్తహబ్. అయితే ఈ రెండు రకాతుల కృతజ్ఞతాపూర్వక నమాజ్ వాజిబ్ (తప్పనిసరి) కాదు.

రెండు రకాతులు నమాజ్ చదివిన తర్వాత మీరు మర్వహ్ వైపున ఉన్న ద్వారం గుండా బయటికి వెళ్లిపోండి. ఇప్పుడు మీరు ఉమ్‌రహ్‌కు సంబంధించిన ఆఖరి విధిని నెరవేర్చవలసి ఉంటుంది. అనగా మీ తల వెంట్రుకలను కత్తిరించడం. మర్వహ్‌కు వెలుపల మంగలివాళ్ళకు చెందిన ఎన్నో దుకాణాలు ఉన్నాయి. ఏ దుకాణంలోనయినా వెళ్ళి తల వెంట్రుకల్ని తీయించుకోవచ్చు. మహిళలు తమ తల యొక్క నాల్గవ భాగంలో ఒక అంగుళం మేరకు తల వెంట్రుకల్ని కత్తిరించాలి. ఉమ్‌రహ్‌కు సంబంధించిన విధులన్నింటినీ నిర్వహించి కేవలం తల వెంట్రుకల్ని కత్తిరించడం మాత్రమే మిగిలియున్న వారు స్వయంగా తమ తల వెంట్రుకల్ని కత్తిరించుకోవచ్చు. అలాగే వారు తమ వలె ఉమ్‌రహ్‌కు సంబంధించిన ఇతర విధులనన్నింటినీ నిర్వహించడం పూర్తయి కేవలం తల వెంట్రుకల్ని కత్తిరించడానికి సంబంధించిన ఆఖరి విధి మాత్రమే మిగిలియున్న ఇతరులు తల వెంట్రుకలను సైతం కత్తిరించవచ్చు. మహిళలు కేవలం తమ భర్తల

ద్వారా లేదా మహ్‌రమ్ పురుషుల ద్వారా (వివాహం కొరకు శాశ్వతంగా నిషిద్ధ బంధుత్వాన్ని కలిగియున్న పురుషులు) మాత్రమే తల వెంట్రుకల్ని కత్తిరింపజేయాలి. పర పురుషుల ద్వారా మహిళలు తమ తల వెంట్రుకలను కత్తిరింపచేసినట్లయితే వారికి పాపం కలుగుతుంది. ఎందు కంటే పర పురుషులతో పరదాను పాటించడం మహిళల విధి. ఆ విధి ఎట్టిపరిస్థితుల్లోనూ మహిళలకు వర్తిస్తుంది.

తల వెంట్రుకలను కత్తిరించుకున్న తర్వాత ఇహ్‌రామ్‌కు సంబంధించి అప్పటి వరకు మీ పై ఉన్న ఆంక్షలన్నీ తొలగిపోతాయి. అల్‌హమ్‌దులిల్లాహ్ ఆ విధంగా మీ ఉమ్‌రహ్ సరియైన రీతిలో నెరవేరుతుంది. అప్పుడు మీరు ఇంటికి వెళ్ళి స్నానం చేసి మీరు రోజు ధరించే దుస్తులను ధరించండి.

మక్కాలోనే నివసించే వారి కొరకు మస్జిదె హరామ్‌లో నఫిల్ నమాజ్ చదవడమనేది ఉత్తమ ఆరాధన. అయితే మక్కాకు దూరంగా నివసించే వారి కొరకు నఫిల్ తవ్వాఫ్ చేయడమనేది నఫిల్ నమాజ్ చదవడం కంటే ఉత్తమమైన ఆరాధన అవుతుంది. ఎందు కంటే నఫిల్ నమాజ్‌ను వారు తమ స్వస్థలానికి వెళ్ళిన తర్వాత కూడా చదవగలరు. కానీ తవ్వాఫ్ చేసే అవకాశం మాత్రం వారికి మరెక్కడా లభించదు. కనుక హజ్ యాత్రికులు మక్కాలో ఉన్నంత కాలం వీలయినన్ని ఎక్కువ సార్లు తవ్వాఫ్ చేసేందుకు ప్రయత్నించాలి. అలాగే అన్ని నమాజులనూ మస్జిదె హరామ్‌లో జమాఅత్‌తో కలిసి చదివేందుకు ప్రయత్నించాలి. మస్జిదె హరామ్‌కు చుట్టుపక్కల ఎన్నో మస్జిద్‌లు ఉన్నాయి. ప్రజలు సౌలభ్యం కొరకు ఆ మస్జిద్‌లలో లేదా తాము బస చేసిన గదుల్లో జమాఅత్‌ను ఏర్పరుచుకొని నమాజ్ చదువుతూ ఉంటారు. అయితే ఒక పుణ్యఫలానికి బదులు లక్ష రెట్లు ఎక్కువగా పుణ్యఫలం మాత్రం మస్జిదె హరామ్‌లో మాత్రమే లభ్యమవుతుంది. చుట్టుపక్కలి మస్జిద్‌లలోనూ మరెక్కడా లభించదు. ఈ విషయాన్ని హజ్ యాత్రికుడు ఎన్నడూ మరువరాదు.

(ఇస్లాంక్రాంతి (మాసపత్రిక) ఎడిటర్
మౌలానా ఉబైదుర్రహ్మాన్, విజయవాడ సౌజన్యంతో)

# అల్లాహ్ ప్రేమించే ఏడు గుణాలు

1. తౌబా: పశ్చాత్తాపం.
నిశ్చయంగా అల్లాహ్ పశ్చాత్తాపం పడే వారిని ప్రేమిస్తాడు. (Quran 2 : 222)
2. తహరత్: పరిశుభ్రత.
అల్లాహ్ పారిశుద్ధ్యాన్ని అవలంబించే వారిని ప్రేమిస్తాడు. (Quran 2 : 222)
3. తఖ్వా: భయభక్తులు.
నిశ్చయంగా అల్లాహ్ భయభక్తులు గల వారిని ప్రేమిస్తాడు. (Quran 9 : 4)
ఇహ్సాన్: మంచి అలవాట్లు, సదాచరణ.
అల్లాహ్ ఇలాంటి సదాచర సంపన్నులనే ప్రేమిస్తాడు. (Quran 3 : 134)
5. తవక్కుల్: అల్లాహ్ పై నమ్మకం.
నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు. (Quran 3 : 159)
6. అద్ల్: న్యాయం.
నిస్సందేహంగా అల్లాహ్ న్యాయశీలురను ప్రేమిస్తాడు. (Quran 5 : 42)
నిశ్చయంగా సమభావంతో వ్యవహరించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. (Quran 49 : 9)
7. సబ్ర్: సహనం.
అల్లాహ్ సహనం వహించే వారిని ప్రేమిస్తాడు. (Quran 3 : 146)
అల్లాహ్ ప్రేమను పొందాలంటే మనం ఈ 7 గుణాలు కలిగి ఉండాలి.
ఇన్ షా అల్లాహ్....

- డా.ఫజులుల్లా ఖాన్

# హజ్‌లో చేయకూడని పనులు

## హరాం డబ్బుతో హజ్ చేయరాదు

-ముఫ్తి ముహమ్మద్ ఫారూఖ్ అల్ ఖాశిమీ,

లబ్బీపేట, విజయవాడ

### మొదటిది ఇతరుల నుంచి దోచుకున్న డబ్బు

మీ మీద నమ్మకంతో ఇతరులు మీదగ్గర దాచుకున్న డబ్బును మీరు సొంతానికి వాడుకొని మోసం చేయడం.

షరియత్ ప్రకారం ఆస్థుల పంపకంలో సోదర సోదరిలకు పంచకుండా మీ స్వార్ధానికే వాడుకోవడం. దొంగతనం చేసి సంపాదించిన డబ్బు, లంచాలు తీసుకున్న డబ్బు, ఈ డబ్బంతా హరాం కిందకే వస్తుంది. హరాం డబ్బుతో హజ్ చేయడం ఇస్లాంలో విరుద్ధం.

ఒక వేళ మీ దగ్గర హరాం డబ్బు వుంటే, హజ్ యాత్రకు వెళ్ళే ముందే, ఆ డబ్బును ఎవరికి చెందిందో వారికి వాపసు ఇవ్వాలి. ఒక వేళ హక్కు దారుడు చనిపోయి వుంటే ఆ సొత్తును వెంటనే సద్ఖా(దానం) చేయడం తప్పనిసరి. హరాం డబ్బు తీసుకోవడం, దాచుకోవడం, వాడుకోవడం, ఆధ్యాత్మిక కార్యక్రమంలో వాడటం కూడా ఇస్లాంలో నిషేధం.

హరాం సొత్తు గురించి ఖురాన్‌లోని ఆయత్, ప్రవక్తకు చెందిన రెండు హదీసులు, ముస్లింలు గుణపాఠం నేర్చుకోవడానికి సరిపోతాయి.

(1) సురే నిసా ఆయత్ నెంబర్ 10లో హరాం సొత్తు గురించి అల్లాహుతాలా హెచ్చరించాడు. ఏ వ్యక్తి అయితే అనాథల సొమ్ముతింటాడో ఆ వ్యక్తి తన కడుపును నిప్పుతో నింపుకుంటున్నాడు. ఆ వ్యక్తి త్వరలోనే నరకంలోకి వెళ్తాడు.

(2) ముస్లిం షరీఫ్ హదీసు ప్రకారం హజరత్ అబూ హురేరా(ర)ల ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు. అల్లా పవిత్రుడు. ఆయన పవిత్రమైన సొత్తునే అంగీకరిస్తాడు. అల్లా ప్రవక్తలకు ఏం ఉపదేశించాడో అదే ముస్లింలకు చెప్పాడు. ఓ ప్రవక్తల్లారా, తినండి మంచి వస్తువుల్ని. మంచి పనుల్ని చేయండి. పవిత్రంగా వుండండి. (సూరతుల్ బఖరా 172)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఒక వ్యక్తి గురించి ప్రస్తావించారు. సుదీర్ఘ ప్రయాణం చేసి అలసిపోయాడు. అతని వెంట్రుకలు చల్లాచెదుకైయాయి. వంటిపై మట్టి పేరుకుపోతుంది. ఆ వ్యక్తి బైతుల్లా చేరుకొని చేతులెత్తి, ఓ సష్టికర్త అంటూ అల్లాహుతాలాను వేడుకుంటాడు. కానీ అతని తిండి హరాం, తాగే నీరు హరాం, అతను తొడిగిన బట్టలు హరాం, ఇలాంటి వ్యక్తి వేడుకోలు అల్లా వద్ద ఎలా అంగీకరించబడుతుంది? (ముస్లిం షరీఫ్ మిష్కకువాత్)

(3) హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి 10 దిర్హమ్‌లతో బట్టలు కొనుగోలు చేశాడు. అందులో ఒక దిర్హమ్ హరం అయితే అల్లాహుతాలా అతని నమాజ్‌ను అంగీకరించడు. ఎప్పటి వరకు ఆ బట్టలు అతని శరీరంపై వున్నాయో అప్పటి వరకు ఆయనే చేసే నమాజ్‌ను అల్లా అంగీకరించడు. హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) తన

రెండు చేతుల వేళ్ళను చెవుల్లో దూర్చి ఇలా అన్నారు. ఈ మాటలు నేనే చెప్పేవికావు. దైవప్రవక్త ముహమ్మద్(స) నుంచి నేను విన్నాను. నేను అబద్దం చెబితే నా రెండు చెవ్వులు పనికిరాకుండా పోతాయి. చెవిటివాడిగా మిగులుతాను. (మస్నత్ అహ్మద్ బహెకీ మిష్కువాత్)

హజ్ - ఉమ్రా చేయాలనుకునే వారు ముందుగా చేయాల్సిందేమిటంటే తమ వద్ద వున్న సొత్తు హరాం, హల్ అనేది నిర్ధారించుకోవాలి. ఒక వేళ హరాం సొత్తు వుంటే, అమాయకుల హక్కుల్ని కాలరాసి దోచుకున్న సొమ్ము అయితే ఆ డబ్బును సదరు వ్యక్తికి వెంటనే ఇచ్చివేయాలి. ఆ తరువాత హలాల్ సంపాదన కూడబెట్టు కోవాలి. హలాల్ డబ్బుతోనే హజ్, ఉమ్రాకు వెళ్లాలి. అక్కడకు వెళ్ళిన తరువాత కూడా హలాల్ సంపాదనే తినాలి. వాడుకోవాలి. ఇతరుల సొమ్ము మీ దగ్గర వుంటే అతని అనుమతి లేకుండా వాడుకోవడం హలాల్ కాదు.

# తగువు, చిలిపిచేష్టలు, అసభ్యంగా వ్యవహరించరాదు

## రెండవది: గౌరవ మర్యాద, గొప్పతనం కోసం

హజ్/ఉమరా నియత్ కేవలం అల్లా కోసమే చేయాలి. సంఘంలో తమ గొప్పతనం చూపించుకోవడం కోసమే చేస్తే, అలాంటి హజ్/ఉమరా ద్వారా ఎలాంటి పుణ్యం, ప్రయోజనం వుండదు. సమయం, డబ్బు వృధా. ప్రతి అడుగడుగులో స్వంత డబ్బా కొట్టుకోవడం, తమ గొప్పతనంకోసం ప్రచారం చేసుకునే ఉద్దేశం ఉండరాదు కేవలం ఇబాదత్ అల్లా కోసమే చేయాలి. మీ నియత్ కూడా అల్లాను సంతోషపెట్టాలనే వుండాలి. సంఘంలో గొప్పతనం ప్రదర్శించడానికి వుండరాదు.

(1) హదీస్ ప్రకారం: ఎవరైతే తమ నమాజ్, రోజా, సద్ఖాను అల్లా కోసం కాకుండా సంఘంలో గొప్పతనం కోసం, ప్రదర్శిస్తే అలాంటి నమాజ్, రోజా, సద్ఖాను అల్లా అంగీకరించడు. అది షిర్క్ కిందకి వస్తుంది. (మష్ఖత్)

(2) హజరత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం జిల్‌హజ్ తొమ్మిదవ తేదీ నాడు ప్రవక్త ముహమ్మద్(స) అర్ఫాత్ వెళ్ళడానికి మీనా నుంచి బయలుదేరారు. ప్రవక్త(స) కూర్చున్న ఒంటె మీద సాదారణమైన చాదర్ వుంది. దాని విలువ కేవలం నాలుగు దిర్హంలు మాత్రమే. అంటే ప్రవక్త(స) ఎలాంటి హంగామా లేకుండా సాదారణ మైన బట్టలతో బయలుదేరారు. అప్పుడు ఆయన నోటి నుంచి ఈ అరబీ ఆయత్‌లు వెలువడ్డాయి.

" అల్లాహుమ్మాజ్ అల్ హజ్జా లా రియా ఫీహి వలా సంఅత్"

"ఓ అల్లాహ్ అలాంటి హజ్ చూపించు. అందులో ప్రదర్శన, ప్రచారం లేకుండా." మరో హదీస్ ప్రకారం "అల్లాహుమ్మాజ్ అల్ హజ్జతన్"

ఇక్కడ ఓ విషయం అర్థం చేసుకోవాలి. ప్రవక్త ముహమ్మద్(స) ఈ ఆయత్ ద్వారా తన ఉమ్మత్‌ను ఇలా స్పష్టం చేశారు. తన ఉమ్మత్ చేసే హజ్, ఉమరాలో ఎలాంటి ప్రదర్శన, ప్రచారం వుండవద్దు. కేవలం అల్లాహ్‌ను రాజీ పరచడానికే నియత్ చేసుకోవాలి.

## మూడవది: పనికిరాని మాటలు, తప్పుడు పనులు, అసభ్యంగా వ్యవహరించడం

ఖురాన్‌లోని సురే బఖరాలో హజ్ ప్రస్తావన వచ్చినప్పుడు అక్కడ మూడు అలవాట్ల గురించి స్పష్టంగా చెప్పబడింది.

హజ్ సమయంలో చాలా తక్కువ మంది మాత్రమే ఈ ఖురాన్ ఆయత్‌ను గుర్తు పెట్టుకుంటారు. ప్రతి రోజూ ఈ ఆయత్‌ను ఉదయం, సాయంత్రం చదువుతూ వుండాలి. అర్థం చేసుకోవాలి. హదీస్‌లో కూడా స్పష్టంగా వుంది. "ఫమన్ ఫర్జ ఫీహిన్ అల్ హజ్ ఫలా రఫస వలా ఫుసుఖ వలా జిదాల ఫిల్ హజ్" ఎవరైతే హజ్ రోజుల్లో తనపైన హజ్ విధిగా చేసుకున్నారో, హజ్‌లో ఆ వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ పనికిరానిమాటలు, తప్పుడు పనులు, అసభ్య చేష్టల నుంచి దూరంగా వుండాలి.

"రఫస"లో పనికిరాని మాటలు, తప్పుడు పనులు, అసభ్య చేష్టలు తదితర చెడు పనులు, చర్యల నుంచి దూరంగా వుండాలి.

ఇహ్రాం కట్టుకున్న తరువాత ఆ వ్యక్తి తన భార్యతో సంభోగం చేయరాదు. హజ్ అసలు పూర్తికాక ముందే అంటే అరఫాత్ కంటే ముందు తన భార్యతో సంభోగం చేస్తే అతని హజ్ పూర్తి కాదు. మరో ఏడాది హజ్ చేయాల్సిందే. అలానే తన భార్యతో అనవసరపు మాటలు, ముద్దులు పెట్టుకోవడం, సరదాగా గడప రాదు. అంటే హజ్‌లో భార్యభర్తల మధ్యే ఇలాంటి చర్యలు (జాయజ్) సరికానప్పుడు, ఇతర మహిళలు, పురుషులతో సంభాషణలు, చర్యలు, చేష్టలు ఎలా (జాయజ్) హలాల్ అవుతాయి? అందుకే ప్రతి హజ్ యాత్రికుడి నోటి దురుసు, చిలిపి చేష్టలు, అసందర్భ మాటలపై నియంత్రణ తప్పనిసరి చేయబడింది.

## నాల్గవది: (ఫుసూఖ్) పాపకార్యాలు

హజ్ యాత్రలో పుణ్యం కొద్ది ప్రతిఫలం లభిస్తుంది. అయితే మీ "ధృఢసంకల్పం" (తఖ్వా) అనేదే ప్రధానం. హజ్ చేసేటప్పుడు తప్పుడు పనులు, హరాం పనుల నుంచి అప్రమత్తంగా వుండాలి. ఇహ్రాం కట్టుకునే ముందు ఏదైతే హరాం వుందో, ఇహ్రాం విడిచి పెట్టిన తరువాత కూడా అది హరామే. కాబట్టి అలాంటి హరాం పనులు, చర్యల నుంచి బయటపడాలి.

కొన్ని పాపాలు ఇలా వున్నాయి. అవి ఇహ్రాం కట్టుకున్నప్పుడే హరాం అవుతాయి. ఉదాహరణకు ఇహ్రాం కట్టుకున్నపుడు సువాసన రాసుకోవడం, గోర్లు తీసివేయడం తదితర విషయాల నుంచి అప్రమత్తంగా వుండాలి.

## ఐదవది:(జిదాల్)

## కోపం, తగువులాడుకోవడం, వాదులాడు కోవడం, గొడవపడటం

హజ్ అతిపెద్ద (ఇస్తేమా) సమావేశం. ఇంటిలో దొరికే సుఖసంతోషాలు ఇక్కడ లభించవు. అన్ని రకాల మనస్థత్వాలున్న మనుషులతో కలిసి వుండటం కొంత ఇబ్బందే. మరి కొంత మంది చేష్టలు ఇబ్బందితో పాటు చిరాకు పుట్టిస్తాయి. అంతే కాదు అప్పుడప్పుడు పరస్పరం హజ్ యాత్రికుల మధ్య గొడవ, తిట్టుకోవడం జరుగు తుంది. ఇదంతా షైతాన్ ప్రభావం.

ఇలాంటి చేష్టల వల్ల హజ్ యాత్రికులకు పుణ్యం లభించకుండా వుండాలనే షైతాన్ ప్రయత్నిస్తాడు. అందు కొరకు ప్రతి హాజీ తన ప్రయాణంలో తనపై నియంత్రణ పెట్టుకోవాలి. ఓపికగా వ్యవహరించాలి. కోపాన్ని తగ్గించు కోవాలి. అసహనాన్ని విడనాడాలి.

ఓపిక వహించడం వల్ల లభించే పుణ్యం, ఇబాదత్ చేస్తే లభించే పుణ్యం కంటే ఎక్కువగా వుంటుంది. అల్లాహ్ నామ ధ్యానం, తవాఫ్, నమాజ్, బైతుల్లాను కనులారా చూడడం ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. అయితే ఓపిక పట్టడం

సబర్ చేయడం వల్ల పై ఇబాదత్ కంటే ఎక్కువ పుణ్యఫలం లభిస్తుంది.

అల్లాహ్ ఇలా స్పష్టం చేస్తున్నాడు "ఇన్నమా యు వఫ్ఫా, అస్సాబిరునా, అజ్‌రహుం, బిగ్గైరి హిసాబ్." ఓపిక వహించే వారికి పుణ్యఫలం లెక్కకు మించి లభిస్తుంది.

ఏ వ్యక్తి అయితే తన హజ్ ప్రయాణంలో హజ్ నిబంధనల్ని పాటిస్తూ ఓపిగ్గా వ్యవహరిస్తాడో అతనికి అందరి కంటే ఎక్కువగా, లెక్కకు మించి పుణ్యఫలం లభిస్తుంది.

## ఆరవది: అగౌరవంగా వ్యవహరించడం

కేవలం హజ్ సందర్భంగానే కాదు జీవితాంతం గౌరవంగా, మర్యాదగా వ్యవహరించాలి. హజ్ సందర్భంగా దీనిపై దృష్టి పెట్టాలి. ఎవరితోనూ అమర్యాదగా, అగౌరవంగా వ్యవహరించరాదు. మరెవరినీ కించపరచరాదు.

కేవలం కొంత మంది ఇబాదత్‌కే ప్రాధాన్యత ఇస్తారు కాని గౌరవ మర్యాదల గురించి పట్టించుకోరు. అమర్యాదగా, అగౌరవంగా, కించపరుస్తూ వుంటారు. అలా చేయడం కరెక్ట్ కాదు.

హుజ్జతుల్ విదాలో హాజీలు ప్రవక్త(స)ను కలిసి అనుభూతుల్ని పంచుకున్నారు.(దృష్టిలో పెట్టుకోవాల్సింది ఏమిటంటే ఈ హజ్ ప్రవక్త(స)తో చేసిన మొదటి హజ్) హాజీలు తమ హజ్‌లో జరిగిన తప్పుల్ని ప్రవక్త(స)కు చెప్పారు. తమతో ఇలాంటి పొరపాట్లు జరిగాయన్నారు. అప్పుడు ప్రవక్త(స)వారందరికి ధైర్యం చెప్పారు. అల్లాహ్‌తో క్షమాపణ వేడుకోమని సూచించారు. అప్పుడు ప్రవక్త(స) ఈ విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మర్యాదగా, గౌరవంగా వుండాలి. ఒకరినొకరు కించ పరచుకోరాదు.

హజ్రత్ అసామాబిన్ షరిక్(ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స)తో పాటు హజ్ చేయడానికి బయల్దేరాను. వెళ్లాను. ప్రజలు ప్రవక్త(స) వద్దకు వస్తున్నారు. అందులో కొంత మంది చెబుతున్నారు. "యా రసూలల్లా నేను సఫా మర్వా వద్ద సై, తవాఫ్ కంటే ముందు చేశాను. నేను ఫలానా ఇబాదత్ ఇలా చేశాను. అలా చేశాను అని చెప్పారు.

అప్పుడు ప్రవక్త(స) వారి అనుమానాలపై స్పష్టమైన సూచనలు చేశారు. తప్పులేదు. (తెలియని తనం వల్లే జరిగిన పొరపాటు ఇది. పాపం అయితే కాదు.)

"అవును పాపాత్ముడు ఎవరంటే సాటి హాజీపై, మనిషులపై దాడి చేసినవాడు. అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించే వాడు."

హజ్ జరిగే సమయంలో పితురీలు చెప్పడం, తిట్టుకోవడం, సాటి వారి మనస్సు గాయపర్చడం, ఇతరుల వస్తువుల్ని వారి అనుమతి లేకుండా వాడుకోవడం లాంటి చెడు చర్యల నుంచి దూరంగా వుండాలి.

ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాలి ఇహ్రాం స్థితిలో వున్నప్పుడు, హరంలో వున్నప్పుడు జంతువును షికార్ చేయడం నేరం. నిషేధం.

జంతువులకు సంబంధించే అల్లాహ్ నుంచి ఇలాంటి ఆదేశాలున్నప్పుడు తమతోటి ముస్లింల పరువు తీయడం, అగౌరవంగా వ్యవహరించడం, అతనిని దోచుకోవడం, ఇబ్బంది పెట్టడం, గొడవపడడం, దాడిచేయడం లాంటి చర్యలకు పాల్పడరాదు.

## త్వరపడడం, ఆత్రుతృతపడడం:

షరియత్ ప్రకారం ఇబాదత్ హాయిగా సంతోషంగా చేయాలి. త్వరపడం, ఆతృతపడుతూ తమ ఇబాదత్‌ను చెడగొట్టుకోకండి. అందుకే ఖురాన్ స్పష్టంగా ఆదేశిస్తుంది. ఖురాన్ చదివేటప్పుడు ఆగి ఆగి స్పష్టంగా పలుకుతూ, అర్థం

చేసుకుంటూ చదవాని.

ఖురాన్ మరియు హదీస్ ప్రకారం నమాజ్ కూడా హాయిగా, సంతోషంగా పూర్తి చేయాలి. ఒక సహాబీ త్వరత్వరగా నమాజ్ చేస్తే అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స), ఆ సహాబీని మళ్ళీ నమాజ్ చేయమని ఆదేశించారు. జమాత్ నమాజ్ జరుగుతున్నప్పుడు కూడా మీరు త్వరత్వరగా, పరుగెత్తుకొంటూ వచ్చి ఆతృతగా నమాజ్ చేయాల్సిన అవసరం లేదు.

హజ్‌లోనూ ప్రవక్త ముహమ్మద్(స) త్వరపడడం, ఆతృతపడం చేయరాదని స్పష్టంగా ఆదేశించారు. దీనిపై మూడు హదీస్‌లున్నాయి.

(1) హజ్రత్ జాబిర్(ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స) ముజ్దలిఫా నుంచి మీనా వైపుకు బయలుదేరినప్పుడు ఆయన చాలా హాయిగా, సంతోషంగా కనిపించారు. ఇతరులు కూడా హాయిగా, సంతోషంగా, ఉత్సాహంగా వుండాలని సూచించారు. (తిరిమిజి)

(2) హజ్రత్ ఫజల్ బిన్ అబ్బాస్ : ప్రవక్త (స) సవారిపై ఆయన కూడా ఉన్నారు. అర్ఫాదినం, అంటే జిల్ హజ్ 9వ తేదీ, ముజ్దలిఫా రోజు ఉదయం అంటే 10వ తేదీ ఉదయం ప్రవక్తతో పాటు ఆయన అనుచరులతో కలిసి మీనా వైపు బయలుదేరేటప్పుడు ప్రవక్త ప్రసంగిస్తూ "ఓ నా జాతి ప్రజలారా హాయిగా, సంతోషంగా, ఉత్సాహంగా ఉండండి."(ముస్లిం షరీఫ్)

(3) హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) ఉల్లేఖనం ప్రకారం అర్ఫాత్ రోజు ప్రవక్త(స)తో కలిసి ముజ్దలిఫా వైపు బయలు దేరుతూ వున్నాం. అప్పుడు ప్రవక్త(స) వెనుకవైపు ఒంటెల్ని, కొట్టడం, అరవడం లాంటి శబ్దాలు విని ఆ వైపు చూశారు. "ఓ ప్రజలారా మీరు సుఖంగా హాయిగా, ఉత్సాహంగా, సంతోషంగా వుండండి. సవారీని పరుగెత్తించడం అంటే మీరు పరుగెత్తినట్లే, అలా చేయకండి. ఒంటెల్ని పరుగెత్తించకండి, మీరు పరుగెత్తవద్దు". హాయీగా వుండండి. అందులోనూ పుణ్యం వుంది.(బుఖారీ)

హజ్రత్ హాఫీస్ ఇబ్నె హజర్(రహ) ఉల్లేఖనం ప్రకారం బుఖారీ హదీస్ హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ)నే అర్ఫాత్ మైదానంలో ఖుద్బా ఇచ్చేటప్పుడు ఇలా వ్యాఖ్యానించారు. "ఎవరి గుర్రం, లేదా ఒంటె ముందు వెళ్ళినంత మాత్రాన పుణ్యంలో ముందుకు వెళ్ళినట్లు కాదు. ఆ వ్యక్తికే ఎక్కువ పుణ్యం లభిస్తుందని కాదు. ఇబాదత్ హాయిగా సౌకర్యంగా చేస్తే ఎక్కువ పుణ్యం, ఫలం లభిస్తాయి.

ఒక వ్యక్తి ఇహ్రాం కట్టుకొని ఇంటిని, కుటుంబ సభ్యుల్ని విడిచి అల్లాహ్ కోసం నియత్ చేసుకొని బయలు దేరాడో, ఆయన నాలుకమీద అల్లా ధ్యానం వుంది. మనస్సులో అల్లాహ్ కోసం ఉత్సాహం వుంది. అతని శరీరం ప్రయాణ ఇబ్బందుల్ని ఓర్చుకుంటూ ఓపికగా వుంటోంది.

అలాంటి వ్యక్తి విమానంలో కూర్చున్నా, బస్సులో ప్రయాణం చేసినా, రూంలో నిద్దురపోతున్నా, లేదా ఎయిర్ పోర్ట్‌లోని ఏదో ఒక మూల కూర్చొని అల్లాహ్‌ను ధ్యానం చేస్తూ అల్లాహ్ గృహం వైపుకు వెళ్తున్నప్పుడు, రెండు, నాలుగు, ఆరు గంటలు ఆలస్యం అయినా ఏం అవుతుంది?

ఇంటిని అయితే వదిలి వచ్చాడు. తిరిగి సరైన సమయానికే చేరుకుంటాడు. అలాంటప్పుడు ఎందుకు ఆతృత, తొందర దీంతో ఏంలాభం, ఓపికగా వ్యవహరిస్తే పుణ్యం ఎంతో ఎక్కువగా వుంది. అందుకే ప్రతి ఇబాదత్ హాయిగా, ఉత్సాహంగా చేయాలి.

# హజ్‌యాత్ర-సందేహాలు-సమాధానాలు

**1)** కర్నూల్ నుంచి షేక్ నూర్, సోడా షాప్ యజమాని

ప్రశ్న: ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నాం. ఏవో కొన్ని సూరాలు మాత్రమే వచ్చు. ఎప్పుడూ ఖురాన్ చదవడం రాదు. ఎలా హజ్ చేయాలి? భయం వేస్తోంది. ఏం నేర్చుకోవాలి?

జవాబు: ఐదు సార్లు ప్రతి రోజూ మజీద్‌కు వెళ్ళి నమాజ్ చేయండి. సంకోచించకుండా నమాజ్ తరీఖా, చదవాల్సిన సూరాలను నేర్చుకోండి. ఫజ్ర్, జుహర్, అస్ర్, మగ్రిబ్, ఇషా ఐదు సార్లు నమాజ్ చేయండి. సూరే ఫాతిహా, అల్ ఇఖ్లాస్,అల్ ఫలఖ్, అన్ నాస్, అల్ కాఫిరూన్, అయతల్‌కుర్సీ, దురూద్, తవాఫ్‌లో చదవాల్సిన సూరాలను కంఠస్థం చేసి హజ్ యాత్రకు సిద్ధం కండి. వీలైతే మీకు నచ్చిన జమాత్ వాళ్ళతో సంప్రదించి వారం రోజుల పాటు హజ్‌పై ప్రత్యేక శిక్షణ తీసుకోండి. హజ్ కమిటీ ఏర్పాటు చేసే క్లాసులకు తప్పనిసరిగా వెళ్ళండి.

**2)** విజయనగరం నుంచి షేక్ సలీమా బానో

ప్రశ్న: మహెరం అంటే ఎవరు? మహెరంగా బావ, లేక బాబాయి కొడుకుతో కలిసి వెళ్లవచ్చా?

జవాబు: బావతో, బాబాయి కొడుకుతో మీరు హజ్ యాత్ర చేయడానికి షరియత్ అనుమతించదు. మహిళ హజ్ యాత్రకు వెళ్లాలంటే తప్పనిసరిగా మహెరం వుండాల్సిందే. అయితే ఒక మహిళకు తండ్రి, సోదరుడు, మామయ్య, బాబాయి, పెద్దనాన, తాతయ్య, భర్త, కొడుకు, సోదరి కొడుకు, అన్న కొడుకుతో వెళ్లవచ్చు. మహిళకు ఎవరితో నిఖా నిషేధం అవుతుందో వారే మహెరం అవుతారు.

**3)** విజయవాడ నుంచి అబ్దుల్ వహాబ్

ప్రశ్న: అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాను. మాకు ఇద్దరు పిల్లలు. వారు అమెరికాలోనే జన్మించారు. అయితే వారికి ఇండియన్ పాస్‌పోర్ట్ లేదు. నాకు, నాభార్యకు ఇండియన్ పాస్ పోర్ట్ వుంది. మేం పిల్లలతో కలిసి హజ్ యాత్రకు వెళ్ళవచ్చా?

జవాబు: సెంట్రల్ హజ్ కమిటీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలంటే మొదటి కండీషన్ భారతీయులై వుండాలి. ఇండియన్ పాస్ పోర్ట్ వుండాలి. మీ ఇద్దరి పిల్లలకు అమెరికన్ పౌరసత్వం మాత్రమే ఉంది కాబట్టి మీతో పాటు మీ పిల్లల్ని తీసుకొని వెళ్ళడానికి అవకాశం లేదు. భారత పౌరసత్వం, పాస్‌పోర్ట్ వుంటేనే మీరు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మీరు వెంటనే మీ పిల్లలకు అమెరికా పౌరసత్వంతో పాటు భారతీపౌరసత్వం తీసుకొని ఇండియన్ పాస్‌పోర్ట్ కూడా పొందండి. అప్పుడే మీరు మీ పిల్లలు కలిసి వెళ్ళడానికి అవకాశం వుంటుంది.

**4)** అనంతపూరం నుంచి సయ్యత్ నజీరుద్దీన్

ప్రశ్న: నాకు అనంతపూర్ అడ్రస్‌తో పాస్‌పోర్ట్ వుంది. నేను కర్నాటకకు చెందిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. అయితే ఆమెకు బెంగుళూర్ అడ్రస్‌తో పాస్‌పోర్ట్ వుంది. అయితే మేం ఇద్దరం ఏ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్ళవచ్చు.

జవాబు: సెంట్రల్ హజ్ కమిటీ గైడ్‌లైన్స్ ప్రకారం భర్త ఏ రాష్ట్రానికి చెందినవాడో, అతని పాస్ పోర్ట్ అడ్రస్‌ను బట్టి ఆ రాష్ట్రం నుంచే దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. మీరు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వారే కాబట్టి ఆంధ్రప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకొని మీ ఇద్దరూ హజ్ యాత్రకు వెళ్ళవచ్చు.

# విదేశీ విద్యా పథకం

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనార్టీ విద్యావంతులకు విదేశీ విద్యా పథకం ద్వారా విదేశాలలో చదువుటకు చక్కటి అవకాశం కల్పిస్తున్నది.**

మైనార్టీల సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ధీటుగా అవకాశాలను అందిపుచ్చుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకొనే మహాద్భాగ్యాన్ని ఈ విదేశీ విద్యా పథకం ద్వారా కల్పిస్తుంది. పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్ భారత ప్రభుత్వం ద్వారా మైనార్టీ విద్యార్థులకు అందించబడుతుంది. ఈ పథకం ద్వారా ఎక్కువ శాతం మైనార్టీ విద్యార్థులు దేశ అత్యున్నత విద్యా సంస్థలలో విద్యను అభ్యసించుచున్నారు. కానీ ఆర్థిక కారణాల వలన విదేశీ విద్యను అందుకోలేక పోతున్నారు. ఎపి ప్రభుత్వం వారి ఆశలు, ఆకాంక్షలకు అండగా నిలిచే ఈ విదేశీ విద్యా పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది.

### అర్హత:

* వయస్సు ప్రకటన సంవత్సరం జులై 1వ తేదీ నాటికి 35 సంవత్సరాలు మించకూడదు. అభ్యర్థి తల్లిదండ్రులు/సంరక్షకుడు వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి ఏడాదికి రూ.6.00 లక్షలకు మించకూడదు.
* ఒక కుటుంబం నుంచి ఒక మైనార్టీ విద్యార్థిని మాత్రమే పరిగణించబడతారు.
* ప్రాయోజిత అభ్యర్థిని ద్వితీయ లేదా తదుపరి సార్లు కోసం పరిగణించబడరు.
* మార్కులు రోలింగ్ కట్ ఆఫ్ పద్ధతిని పాటిస్తారు.
* సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ(ఇంజనీరింగ్/నిర్వహణ/ప్యూర్‌సైన్స్/వ్యవసాయ శాస్త్రాలు/ఔషదం మరియు నర్సింగ్/సామాజిక శాస్త్రాలు/హ్యూమనిటీస్)
* 33 శాతం మహిళా అభ్యర్థులకు కేటాయించబడును.

### స్కాలర్ షిప్ మరియు ఫీజు:

* రూ.10.00 లక్షల మొత్తాన్ని ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందజేయబడును.
* స్కాలర్‌షిప్ మరియు ఫీజు రెండు వాయిదాలలో చెల్లించే విధంగా ఉంటుంది.

**మొదటి విడతగా:**

* రూ.5.00 లక్షల మొత్తాన్ని ల్యాండింగ్ పర్మిట్/1-94 కార్డు (ఇమ్మిగ్రేషనన్ కార్డు) సమర్పించిన పిదప చెల్లించెదరు.

**రెండవ విడతగా:**

* రూ.5.00 లక్షల మొత్తాన్ని ఒక సెమిస్టార్ ఫలితాల తర్వాత విద్యార్థికి చెల్లించెదరు.
* మరియు ఎంపికైన అభ్యర్థులకు జాతీయ బ్యాంకుల నుంచి విద్య కొరకు రుణం 5 లక్షల వరకు పొందవచ్చును.

### ప్రయాణ ఖర్చు:

* ప్రయాణ వీసా మరియు అడ్మిషన్ పొందిన వారికి సాధారణ క్లాస్ నందు ప్రయాణ ఖర్చులు ఇవ్వబడును.

### వీసా ఫీజు:

* చట్టబద్ధమైన వీసా మరియు వీసా రెసిప్ట్ పొందుపరచిన వారికి వీసా ఖర్చులు తిరిగి ఇవ్వడం జరుగును.
* పిజి/పిహెచ్.డి నందు క్రింది విభాగాలలో అనగా ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/ప్యూర్ సైన్స్/అగ్రికల్చర్ సైన్స్/

మెడిసిన్, నర్సింగ్/సోషల్ సైన్స్/హ్యూమానిటీస్ లకు మరియు ఒక సంవత్సర కాలపరిమితి కలిగినటువంటి పి.జి. డిప్లొమా విభాగాలకు ఈ పథకం క్రింద సహాయం చేయడం జరుగును.

* ఈ పథకం క్రింద విదేశాలనందు ఎం.బి.బి.ఎస్ చదువుకొనుటకు అవకాశం కల్పించబడును.
* ఈ పథకం క్రింద సిపిఎ(సర్టిఫికెట్ పబ్లిక్ అకౌంట్) మరియు సిపిఎం(సర్టిఫికెట్ పోర్ట్‌ఫోలియో మేనేజర్) విభాగాలలో యు.ఎస్.లో చదువుకొనుటకు అవకాశం కల్పించబడును.

## అనుమతి వున్న దేశాలు:

* అమెరికా, యు.కె. ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిల్యాండ్, స్వీడన్, నెదర్‌ల్యాండ్స్, ఫ్రాన్స్, డెన్మార్క్, రష్యా, ఫిలిఫైన్స్, కజకిస్తాన్ మరియు చైనా.

## దరఖాస్తు చేసుకునే విధానం:

* అర్హత కలిగిన మైనార్టీ విద్యావంతులు www.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనవలెను.

## అవసరమైన ధృవపత్రాలు:

* అభ్యర్థులు తప్పనిసరిగా వారి టోఫెల్/ఐఇఎల్‌టిఎస్/జిఆర్ఇ/జి.ఎం.ఎ.టి) వివరాలను పొందుపరచవలయును.
* విదేశీ విశ్వవిద్యాలయాలయందు ప్రవేశం పొందినటువంటి ధృవపత్రాల్ని పొందుపరచాలి. అభ్యర్థులు తప్పనిసరిగా వారి ఒరిజినల్ పాస్ పోర్ట్‌ను జతపరచాలి.
* అభ్యర్థులు తప్పనిసరిగా వారి స్వతహాగా విదేశీ విశ్వవిద్యాలయాల యందు అడ్మిషన్ పొందవలయును.
* అభ్యర్థులు వీసా పొందిన దేశం నందే చదువుటకు అర్హులు.
* అభ్యర్థులు ఈ పథకం ద్వారా అవకాశం పొందుటకు అవసరమైన పత్రాల్ని తప్పనిసరిగా జతపరచాలి.

## జత పరచవలసిన పత్రాలు:

* మీ-సేవ నుంచి కుల సర్టిఫికెట్. ఆదాయం సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్
* ఆధార్ కార్డు
* ఇ-పాస్ ఐడి సంఖ్య
* నివాస/జనన సర్టిఫికెట్
* గెజిటెడ్ అధికారి ద్వారా ధృవీకరణ చేయబడిన పాస్ పోర్ట్ కాపీ
* మార్క్‌షీట్, ఎస్ఎస్‌సి/ఇంటర్/గ్రాడ్యుయేట్/పీజీ స్థాయిలో
* జీఆర్ఈ/జి మెట్ లేదా సమానమైన క్వాలిఫైంగ్ పరీక్ష/టెస్ట్ స్కోర్ కార్డు
* టోఫెల్/ఐఈఎల్టీఎస్ స్కోరు కార్డు
* విదేశీ విశ్వవిద్యాలయం నుంచి ప్రవేశ లేఖ (ఐ-20 ప్రవేశ లేదా సమాన లేఖ)
* జాతీయ బ్యాంకు, బ్యాంకు పాస్ పుస్తకం కాపీని స్కాన్ మరియు అప్లోడ్ చేయవలయును.
* ఫోటో స్కాన్ మరియు అప్లోడ్ చేయవలయును
* రూ.10/- స్వీయ డిక్లరేషన్ కానీ న్యాయ స్టాంప్ పేపర్ స్కాన్ మరియు అప్లోడ్ చేయవలయును.